RNI No. APTEL/2012/53127

TELANGANA VANI TELUGU DAILY

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక

The Voice of Telangana

Published From KARIMNAGAR, HYDERABAD, ADILABAD, NIZAMABAD, WARANGAL, KHAMMAM, NALGONDA,

సంపుటి: 16 సంచిక 08 ఎడిటర్: జేరిపోతుల సంపత్, కరీంనగర్ శుక్రవారం 10-04-2026 పేజీలు: 8, వెల : 2.00

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న తెలంగాణ వాణి తెలుగు దినపత్రికకు విలేకరులు కావలెను.

ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు

జిల్లా వారిగా స్టాఫ్ రిపోర్టర్‌లు, నియోజకవర్గాల వారిగా ఆర్‌సి ఇన్చార్జులు, మండలాల వారిగా విలేకరులు కావలెను

సీనియర్లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం ఉంటుంది

ఈ క్రింది నెంబర్‌కు వాట్సాప్ ద్వారా తమ వివరాలు సంప్రదించగలరు

9441558369
9703247143
9493658107



2వ పేజీలో...

## లెబనాన్‌పై ఇజ్రాయెల్..

# భీకర దాడులు

## 250 మంది మృతి

ఢిల్లీ,: మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు మరోసారి భగ్గుమన్నాయి. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో అమెరికా, ఇరాన్ మధ్య రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన కొన్ని గంటల్లోనే ఇజ్రాయెల్.. లెబనాన్‌పై భీకర వైమానిక దాడులకు దిగింది. ఈ దాడుల్లో 250 మందికి పైగా మరణించగా, 1100 మందికి పైగా గాయపడ్డారు. ఈ పరిణామంతో కాల్పుల విరమణ ఒప్పందం భవిష్యత్తుపై తీవ్ర నీలినీడలు కమ్ముకున్నాయి.





## మూడు రాష్ట్రాల్లో ప్రశాంతంగా ముగిసిన

# పోలింగ్..

ఢిల్లీ,: కేరళ, అస్సాం, పుదుచ్చేరిలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రారంభమైంది. గత కొన్ని వారాలుగా సాగిన ప్రచారపర్వానికి ఇప్పటికే ఎండ్ కార్డ్ పడగా.. ఉదయం 7గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. ఈసారి కేరళ ఎన్నికల బరిలో ప్రధానంగా మూడు కూటములు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నాయి. సీఎం పినరయి విజయన్ నాయకత్వంలో వరుసగా మూడోసారి అధికారాన్ని నిలబెట్టుకుని రికార్డు సృష్టించాలని ఎల్డీఎఫ్ చూస్తోంది. సుపరిపాలన - సంక్షేమ పథకాలే తమకు శ్రీరామరక్ష అని ఎల్‌డిఎఫ్ నమ్ముతోంది. కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ ఈసారి..

2వ పేజీలో...



## ముగిసిన జేఈఈ మెయిన్ సెషన్-2

# పరీక్షలు

## ఈ నెల 20 నాటికి ఫలితాలు!

ఢిల్లీ,: దేశవ్యాప్తంగా ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్ 2026 సెషన్ 2 పరీక్షలు విజయవంతంగా ముగిశాయి. ఈ మేరకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) అధికారిక ప్రకటన విడుదల చేసింది. పేపర్ 1 (బీఈ/బీటెక్) ఫలితాలను ఏప్రిల్ 20వ తేదీలోగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపింది. ఏప్రిల్ 2, 4, 5, 6, 8 తేదీల్లో పేపర్ 1 (బీఈ/బీటెక్), ఏప్రిల్ 7న పేపర్ 2 (బీఆర్క్/బీ-ప్లానింగ్) పరీక్షలు నిర్వహించారు.

2వ పేజీలో...



2వ పేజీలో...

## జీవన్‌రెడ్డిని కాంగ్రెస్ అన్నివిధాల ఆదరించింది

- గతంలో కెసిఆర్ పాలనను విమర్శించింది మరిస్తే ఎలా
- పొంగులేటిపై ఆరోపణలు కాదు..దమ్ముంటే చర్చకు రావాలి
- మీడియాతో పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



2వ పేజీలో...

## తాత్కాలిక కాల్పుల విరమణ జరిగినా..

## సైనిక బలగాలు ఇరాన్ చుట్టూ

# కొనసాగుతాయి

## స్పష్టం చేసిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్

వాషింగ్టన్, ఏప్రిల్9 : అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్ పూర్తిగా ఒప్పందాన్ని అమలు చేసే వరకు అమెరికా సైనిక బలగాలు అక్కడే కొనసాగుతాయని తెలిపారు. ఇరాన్-అమెరికా మధ్య బుధవారం రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. అయినప్పటికీ తమ దేశానికి చెందిన యుద్ధ నౌకలు, విమానాలు, సైనికులు, ఆయుధాలు మొదలైనవి ఇరాన్ పరిసర ప్రాంతాల్లోనే ఉంటాయని ట్రంప్ పేర్కొన్నారు .యుద్ధం ముగింపునకు సంబంధించి పూర్తి స్థాయి ఒప్పందం అమలయ్యేంత వరకు సైనికులు వెనక్కి రారని ట్రంప్ తెలిపారు.



2వ పేజీలో...

## మహాభారతం పోరాటంలాగా

# ఉంది

ఢిల్లీ,: భార్యాభర్తల సంబంధాలు రోజురోజుకు దిగజారిపోతున్నాయి. కలకాలం జీవించాల్సిన దంపతులు మధ్యలోనే సంబంధాలు దెబ్బతింటున్నాయి. తాజాగా ఓ జంటకు విడాకులిస్తూ దేశ సర్వోన్నత న్యాయస్థానం అసహనం వ్యక్తం చేసింది. అతడు వృత్తిరీత్యా న్యాయవాది. 2010లో హిందూ సాంప్రదాయం ప్రకారం వివాహం జరిగింది. ఆరేళ్ల పాటు సంసారం సాఫీగానే సాగింది. ఇద్దరు పిల్లలు కూడా పుట్టారు. అంతా బాగుందని అనుకుంటున్న తరుణంలో గొడవలు మొదలయ్యాయి. అంతే 2016లో విడిపోయారు. అయితే భర్త న్యాయవాది కావడంతో న్యాయ నైపుణ్యాన్ని ఉపయోగించి భార్యను వేధించడం ప్రారంభించాడు. భార్య, ఆమె కుటుంబ సభ్యులపై దాదాపుగా 80 కేసులు నమోదు చేశాడు. ఇక కేసు విచారణ సందర్భంగా న్యాయవాది భర్త ప్రవర్తించిన తీరుపై సుప్రీం కోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. జస్టిస్ విక్రమ్ నాథ్, సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం శాశ్వతంగా జంటను వేరు చేస్తూ విడాకులు మంజూరు చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద ఉన్న హక్కును వినియోగించుకుంటూ తీర్పు వెలువరించింది.

- విడాకులిస్తూ సుప్రీంకోర్టు అసహనం
- జంటకు విడాకులు మంజూరు చేసిన సుప్రీంకోర్టు
- వైవాహిక వివాదం మహాభారతం పోరాటంలాగా ఉందని వ్యాఖ్య



2వ పేజీలో...

## పాకిస్థాన్‌పై మాకు నమ్మకం లేదు

ఇజ్రాయిల్ రాయబారి రూవెన్ అజార్ సంచలన వ్యాఖ్యలు



2వ పేజీలో...

## నిప్పుల కొలిమిలా..

# తెలంగాణ

## ఆ రెండు జిల్లాలకు 'ఆరెంజ్ అలర్ట్'!

హైదరాబాద్,: రాష్ట్ర వ్యాప్తంగా భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. వేసవి తీవ్రత రోజురోజుకూ పెరుగుతుండటంతో ఎండలు మండుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచే సూర్యుడు తన భగభగలను మొదలుపెడుతుండటంతో జనం బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. వాతావరణ శాఖ తాజా బులెటిన్ ప్రకారం.. ప్రస్తుతం నమోదవుతున్న గరిష్ట ఉష్ణోగ్రతల కంటే మరో 3 డిగ్రీల సెల్సియస్ మేర వేడి పెరిగే అవకాశం ఉంది. రాబోయే రెండు మూడు రోజుల్లో ఎండ తీవ్రత మరింత ఎక్కువగా ఉంటుందని అధికారులు హెచ్చరిస్తున్నారు.



## ఇంధన కొరత ఆందోళనల నేపథ్యంలో

## ఖతార్‌కు వెళుతున్న కేంద్రమంత్రి

# హర్దీప్ సింగ్ పూరి

2వ పేజీలో...

ఢిల్లీ,: ప్రపంచవ్యాప్తంగా ఇంధన కొరత ఆందోళనలు నెలకొన్న తరుణంలో, కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరి ఖతార్ వెళ్లనున్నారు. వారాంతంలో కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్ కూడా యూఏఈలో పర్యటించనున్నారు. ఏప్రిల్ 9, 10 తేదీలలో హర్దీప్ సింగ్ పూరి ఖతార్‌లో పర్యటిస్తారని కేంద్ర పెట్రోలియం, సహజవాయువుల శాఖ మంత్రిత్వ శాఖ 'ఎక్స్' వేదికగా పోస్టు చేసింది. ప్రపంచవ్యాప్తంగా చమురు, గ్యాస్ కొరత ఆందోళన కలిగిస్తోంది. అయితే భారతదేశం వద్ద మాత్రం తగినంత నిల్వలు ఉన్నాయి. పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమై దాదాపు 45 రోజులు అవుతోంది. యుద్ధం నేపథ్యంలో ఇరాన్ ఖతార్‌పై క్షిపణి దాడులు నిర్వహించింది. దీనితో 17 శాతం వాటా ఉన్న ఖతార్ ఎల్ఎన్‌జీ ఎగుమతులపై ప్రభావం పడిందని ఖతార్ ఎనర్జీ సీఈవో సాద్ ఆల్-కాబి తెలిపారు. ఇరాన్ దాడి వల్ల సంవత్సరానికి 12.8 మిలియన్ టన్నుల ఎల్ఎన్‌జీని ఉత్పత్తి చేసే సామర్థ్యం దెబ్బతిన్నట్లు తెలిపారు. వీటి మరమ్మతులకు మూడు నుంచి ఐదు సంవత్సరాల సమయం పడుతుందని ఆయన వెల్లడించారు. ఎగుమతులు నిలిచిపోవడంతో ఖతార్ సంవత్సరానికి 20 బిలియన్ డాలర్ల వేర నష్టపోతుందని అంచనా వేసినట్లు తెలిపారు.



2వ పేజీలో...

నష్టపోయిన ప్రతి రైతును ఆదుకున్న కెసిఆర్
తెలంగాణ ఏర్పాటు కెసిఆర్ వల్లనే సాకారమయ్యింది
జాయతీయ స్థాయిలో బిజెపి..రాష్ట్రంలో కెసిఆర్ బెటర్
కాంగ్రెస్ పాలన చూశాక బిఆర్ఎస్ నయమన్న భావనలో ప్రజలు
మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు
బిఆర్ఎస్‌లో చేరుతున్నట్లు ప్రకటన

## రేవంత్ కన్నా...

# కెసిఆర్ పాలనే బెటర్

# లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు..



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి కాల్పుల విరమణను ప్రకటించారు. హార్మూజ్ జలసంధి ద్వారా నౌకల రాకపోకలకు అనుమతించేందుకు ఇరాన్ అంగీకరించింది. అయితే, ఈ ఒప్పందం ప్రకటించిన వెంటనే ఇజ్రాయెల్.. లెబనాన్‌లోని బీరుట్, బెకా లోయతో సహా హిజ్బుల్లా స్థావరాలే లక్ష్యంగా విరుచుకుపడింది. అమెరికాతో కుదిరిన ఒప్పందం తమకు, హిజ్బుల్లాకు మధ్య జరుగుతున్న పోరాటానికి వర్తించదని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్పష్టం చేశారు. అధ్యక్షుడు ట్రంప్ కూడా లెబనాన్‌లో జరుగుతున్నది ఒక "ప్రత్యేక ఘర్షణ" అని వ్యాఖ్యానించారు. ఈ దాడులను ఐక్యరాజ్యసమితి తీవ్రంగా ఖండించింది. ఒప్పందం కుదిరిన గంటల వ్యవధిలోనే ఇంతటి మారణహోమం జరగడం నమ్మశక్యంగా లేదని యూఎన్ మానవ హక్కుల చీఫ్ వోల్కర్ టర్క్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇజ్రాయెల్ దాడులకు ప్రతీకారంగా ఉత్తర ఇజ్రాయెల్‌పై రాకెట్లతో దాడి చేసినట్లు హిజ్బుల్లా ప్రకటించింది. "ఇజ్రాయెల్-అమెరికా దురాక్రమణ ఆగే వరకు తమ ప్రతిదాడులు కొనసాగుతాయి" అని హిజ్బుల్లా హెచ్చరించింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఏప్రిల్ 10న ఇస్లామాబాద్‌లో జరగాల్సిన తదుపరి చర్చలు అత్యంత కీలకంగా మారాయి. కాల్పుల విరమణ వార్తతో 95 డాలర్ల దిగువకు పడిపోయిన బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర, లెబనాన్ దాడులతో మళ్లీ 97 డాలర్లకు పెరిగింది.

# రేవంత్ కన్నా... కెసిఆర్ పాలనే బెటర్



జగిత్యాల, ఏప్రిల్9 :రేవంత్ రెడ్డి పాలన కంటే కేసీఆర్ పాలన బాగుందని మాజీ మంత్రి జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను త్వరలోనే బీఆర్ఎస్ పార్టీలో చేరబోతున్నట్లు స్పష్టం చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ... నష్టపోయిన ప్రతి రైతును గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆదుకుందని ప్రశంసించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోతోందని విమర్శించారు. ఉద్యోగులు, నిరుద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. ప్రజలు ఆశించిన పాలన రాలేదని జీవన్ రెడ్డి వ్యాఖ్యానించారు. రేవంత్ పాలన చూసిన తర్వాత కేసీఆర్ పాలనే బాగుందని ప్రజలు భావిస్తున్నారని చెప్పారు. జాతీయ స్థాయిలో బీజేపీ బెటర్ అని.. రాష్ట్ర స్థాయిలో కేసీఆర్ మెరుగైన నాయకుడని అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కేసీఆర్ వల్లే సాధ్యమైందని గుర్తు చేశారు. జీవన్ రెడ్డి వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఇదిలావుంటే 13న జగిత్యాలలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరే అవకాశం ఉందని సమాచారం. కేటీఆర్ జగిత్యాలలో జీవన్ రెడ్డి నివాసానికి వెళ్లి పార్టీలోకి అధికారికంగా ఆహ్వానించనున్నారు. జీవన్ రెడ్డి గతంలో కాంగ్రెస్‌లో సీనియర్ నాయకుడిగా, మంత్రిగా పని చేశారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హైదరాబాద్ నుంచి జగిత్యాలకు

మొదటిపేజీ తరువాయి...

బయల్దేరారు. ఇటీవలే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన మాజీ మంత్రి జీవన్ రెడ్డిని ఆయన నివాసంలో కలవనున్నారు. ఈ సందర్భంగా జగిత్యాల శివారులో బీఆర్ఎస్ శ్రేణులు కేటీఆర్‌కు స్వాగతం పలకున్నాయి. అక్కడి నుంచి బైక్ ర్యాలీతో జీవన్ రెడ్డి నివాసానికి రానున్నారు. కేటీఆర్ రాకతో జీవన్ రెడ్డి నివాసంతో పాటు జగిత్యాల పట్టణం గులాబీమయంగా మారింది. కాగా, కేటీఆర్‌తో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కీలక నాయకులు సైతం జీవన్‌రెడ్డి ఇంటికి రానున్నారు. రాష్ట్ర రాజకీయాలపై చర్చించిన అనంతరం ఆయనను పార్టీలోకి లాంఛనంగా కేటీఆర్ ఆహ్వానించనున్నారు. 1984లో కాంగ్రెస్ పార్టీలో చేరిన జీవన్‌రెడ్డి నలభై మూడేండ్లుగా ఉత్తర తెలంగాణలోనే కీలకమైన నాయకుడిగా గుర్తింపు పొందారు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన జీవన్‌రెడ్డి మూడుసార్లు రాష్ట్ర మంత్రిగా పనిచేశారు. 2014లో తెలంగాణ అవతరించిన తర్వాత ఉత్తర తెలంగాణ జిల్లాల నుంచి కాంగ్రెస్ పార్టీకి చెందిన ఏకైక ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. 2018లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలైన జీవన్‌రెడ్డి 2019లో పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా గెలిచి శాసన మండలిలో ఏకైక కాంగ్రెస్ సభ్యుడిగా కొనసాగారు. జగిత్యాల నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచిన డాక్టర్ సంజయ్‌కుమార్‌ను సీఎం రేవంత్‌రెడ్డి పార్టీలో చేర్చుకోవడంతో జీవన్‌రెడ్డి తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. జీవన్‌రెడ్డి వర్గానికి ప్రాధాన్యత తగ్గిపోవడం, నామినేటెడ్ పదవుల కోసం ప్రతిపాదించిన వారికి పదవులను ఇవ్వకుండా ఎమ్మెల్యే సూచించిన వ్యక్తులకు ఇవ్వడం, ప్రధాన అనుచరుల్లో ఒకరు దారుణహత్యకు గురికావడంతో జీవన్‌రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో జగిత్యాల, రాయికల్ పట్టణాల్లో జీవన్‌రెడ్డి వర్గానికి చెందిన వారిని కాంగ్రెస్ పక్కన పెట్టడంతో తీవ్ర ఆవేదనకు లోనైన జీవన్‌రెడ్డి గత నెల 25న కార్యకర్తలు, నాయకుల సమక్షంలో కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు.

## విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల సమ్మెకు..

# సిపిఎం సంపూర్ణ మద్దతు

### కార్మికుల సమ్మెకు ప్రజా మద్దతు కూడగడతాం
### సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు



కొత్తగూడెం (తెలంగాణ వాణి) :విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికుల సమ్మెకు సిపిఎం సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం ఆర్టిజన్ కార్మికులు చేస్తున్న సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఆర్టిజన్లు ఒక కేటగిరీగా ఏర్పడినప్పటి నుండి వారికి ఎపిఎస్ఇబి రెగ్యులేషన్స్ వర్తింపజేయాలని, ఇతర అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆ కార్మికులు కోరుతున్నారనీ కానీ వీరి డిమాండ్లను ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని ఆరోపించారు. అసలు ఆర్టిజన్ కార్మికులు అంటే ఎవరో నాకు తెలియదు అని ముఖ్యమంత్రి అనడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. ఎన్నికలకు ముందు విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు వారు ఎవరు తెలియదనడం వారి దాటివేత ధోరణికి నిదర్శనమని అన్నారు. కార్మికులు కేవలం తమ పర్మినెంట్ కోసమే కాకుండా విద్యుత్ సంస్థ మనుగడ కోసం పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యుత్ సంస్కరణల వలన విద్యుత్ సంస్థలు ప్రైవేటుపరం అయి కార్మికుల ఉద్యోగాలు కూడా పోయే ప్రమాదం ఏర్పడుతుందని దీనికి వ్యతిరేకంగా కార్మికులు పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని ఆయన గుర్తు చేశారు. న్యాయమైన సమస్యలపై ప్రారంభమైన ఆర్టిజన్ల సమ్మెకు మద్దతుగా నిలవాలని విద్యుత్ సంస్థలోని పర్మినెంట్ ఉద్యోగులను, ప్రజానీకాన్ని విజ్ఞప్తి చేశారు. అత్యంత కీలక రంగంలో, కీలక సమయంలో జరుగుతున్న ఈ సమ్మెలో ఒక కేటగిరీ కార్మికులకు వ్యతిరేకంగా ఇంకొక కేటగిరీ కార్మికులను ఎగదోసే యాజమాన్య ఎత్తుగడలను విద్యుత్ ఉద్యోగులు ఐక్యంగా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి ప్రభుత్వం అనేక రకాల కుట్రలు అనే అవకాశం ఉందని వీటిని కార్మికులు చైతన్యవంతంగా ఐక్యతతో తిప్పికొట్టాలని ఆయన అన్నారు. గతంలోలాగే ఆర్టిజన్ల స్థానంలో శాశ్వత ఉద్యోగులకు డ్యూటీలు వేసే ప్రమాదమున్నదన్నారు. ఇప్పటికే ఆ ప్రయత్నాలు ప్రారంభమైనాయనీ అన్నారు. ఈ పరిస్థితుల్లో విద్యుత్ రంగంలోని ఉద్యోగులందరూ మరింత ఐక్యతతో యాజమాన్య ఎత్తుగడలను ఎదుర్కోవాలని సూచించారు. సామాన్య ప్రజానీకం కూడా విద్యుత్ ఆర్టిజన్ల న్యాయమైన సమ్మెను ఆదరించాలని, వారికి మద్దతుగా నిలవాలని కోరారు. సమ్మె విజయవంతం అయ్యేవరకు సిపిఎం కార్మికులకు మద్దతుగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మంద నరసింహారావు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే బ్రహ్మాచారి, లిక్కి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్, నాయకులు జునుమాల నగేష్, నాగకృష్ణ, ఇరవై ఒకటవ డివిజన్ కార్పొరేటర్ చింతలపూడి శ్రావణి, నాయకులు గండమాల భాస్కర్, శ్రీకాంత్, చింతలపూడి సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన జేఈఈ మెయిన్ సెషన్-2 పరీక్షలు

మొదటిపేజీ తరువాయి...

దేశంలోని 304 నగరాలతో పాటు, విదేశాల్లోని 14 నగరాల్లో కలిపి మొత్తం 566 కేంద్రాల్లో ఈ పరీక్షలను కంప్యూటర్ ఆధారిత (సీబీటీ) విధానంలో జరిపారు. ఈ సెషన్‌కు దాదాపు 11.23 లక్షల మంది విద్యార్థులుహాజరయ్యారు. పేపర్ 1కు 93 శాతం, పేపర్ 2కు 73 శాతం హాజరు నమోదైనట్లు ఎన్టీఏ వెల్లడించింది. ఫలితాల ప్రకటనకు ముందు, ఏప్రిల్ 9న విద్యార్థులు రాసిన ప్రశ్నాపత్రాలను, ఏప్రిల్ 11న ప్రాథమిక ఆన్సర్ కీని విడుదల చేసే అవకాశం ఉంది. ప్రాథమిక కీపై అభ్యంతరాలుంటే, ఒక్కో ప్రశ్నకు రూ.200 రుసుము చెల్లించి సవాలు చేసేందుకు అవకాశం కల్పిస్తారు. విద్యార్థుల నుంచి వచ్చిన అభ్యంతరాలను పరిశీలించిన తర్వాత తుది ఫలితాలను ప్రకటిస్తారు. జనవరిలో జరిగిన సెషన్ 1, ఏప్రిల్‌లో జరిగిన సెషన్ 2 పరీక్షల్లో అభ్యర్థులు సాధించిన ఉత్తమ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకుని ఆల్ ఇండియా ర్యాంకులను కేటాయిస్తారు.

# మహాభారతం పోరాటంలాగా ఉంది..



దాదాపు దశాబ్దకాలం పాటు సాగిన వైవాహిక వివాదాన్ని "మహాభారత యుద్ధం వంటిది"గా అభివర్ణిస్తూ భార్యకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. భరణంగా భార్యకు రూ.5 కోట్లు ఏకమొత్తంగా చెల్లించాలని న్యాయస్థానం ఆదేశించింది. భవిష్యత్తులో భార్యపై గానీ, ఆమె కుటుంబ సభ్యులపై గానీ ఎలాంటి వ్యాజ్యాలు దాఖలు చేయబోనని పేర్కొంటూ ఒక అఫిడవిట్ సమర్పించాలని కూడా భర్తను ఆదేశించింది. ఈ సందర్భంగా భర్త ప్రవర్తనపై ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. "విరోధపూరితమైన, కలహపూరితమైన, కక్షపూరితమైనది"గా అభివర్ణించింది. ఆర్థిక పరిస్థితిని కారణంగా చూపి చెల్లింపును తప్పించుకోవడానికి ప్రయత్నించగా కోర్టు దీనిని "కృత్రిమ కవచం"గా పేర్కొంది. దీంతో భార్యకు రూ. 5 కోట్లు ఏకమొత్తంగా ఒకేసారి ఇవ్వాలని సూచించింది. బాధ్యత నుంచి తప్పించుకోవడానికి భర్త ఉ

మొదటిపేజీ తరువాయి...

ద్దేశపూర్వకంగా కుటుంబ కంపెనీల నుంచి రాజీనామా చేసి, న్యాయవాదిగా పరిచయం చేసుకున్నాడని భార్య ఆరోపించగా కోర్టు ఈ విషయంతో ఏకీభవించింది. ఈ వివాదాన్ని పరిష్కరించడానికి, భరణం, పిల్లల పోషణ భరణం, వ్యాజ్యపు ఖర్చులతో సహా రూ.5 కోట్ల ఏకమొత్తాన్ని చెల్లించాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. ఇద్దరు మైనర్ కుమారుల శాశ్వత సంరక్షణ హక్కును తల్లికి అప్పగించగా.. తండ్రికి నెలవారీగా కలుసుకునే హక్కును కల్పించింది. భార్య ప్రస్తుతం తన మామగారి ముంబై ఫ్లాట్‌లో నివసిస్తోంది. రూ.5 కోట్లు అందిన వెంటనే ఫ్లాట్‌ను ఖాళీ చేయాలని కోర్టు ఆదేశించింది. భవిష్యత్తులో భార్య, ఆమె కుటుంబం లేదా ఆమె న్యాయవాదులపై ఎలాంటి కొత్త కేసులు పెట్టవద్దని భర్తకు సూచించింది. ఈ ఉత్తర్వును ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇచ్చింది. అయితే కోర్టు అనుమతి లేకుండా పిల్లలను భార్య కలకత్తాకు తీసుకువెళ్లిందని.. దీంతో పిల్లల్ని సందర్శించే హక్కును కోల్పోయేలా చేసిందని ఆరోపిస్తూ ఈ విషయాన్ని అతిశయోక్తిగా చెప్పడానికి భర్త ప్రయత్నించాడు. దీనిపై కోర్టు స్పందిస్తూ.. "ఒక తల్లికి సహజంగా తన పిల్లల సంరక్షణ, శ్రేయస్సు, సురక్షితమైన పెంపకమే ప్రధానమైన బాధ్యత. ఈ చర్యను భార్య దురుద్దేశానికి ఆపాదించలేం. ముంబైలో నెలకొన్న తీవ్రమైన శత్రుత్వం, అనేక వ్యాజ్యాలను పరిగణనలోకి తీసుకుంటే.. ఈ తరలింపు ఒక ఆత్మరక్షణ చర్య తప్ప మరేమీ కాదని స్పష్టమవుతోంది." అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.

## జీవన్‌రెడ్డిని కాంగ్రెస్ అన్నివిధాల ఆదరించింది

మొదటిపేజీ తరువాయి...

హైదరాబాద్,ఏప్రిల్9 :మాజీ మంత్రి జీవన్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరబోతున్న సందర్భంగా ఈ విషయంపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. జీవన్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ చాలా చేసిందని ప్రస్తావించారు. ఆయనకు ఉన్నతమైన గౌరవం ఇచ్చిందన్నారు. జీవన్ రెడ్డికి కాంగ్రెస్ 14 సార్లు బీ ఫాం ఇచ్చిందని గుర్తుచేశారు. గురువారం గాంధీభవన్‌లో మీడియాతో మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడారు. ప్రజలు ఎన్నుకున్న నేత సీఎం రేవంత్‌రెడ్డి అని వ్యాఖ్యానించారు. రేవంత్‌రెడ్డి పోవాలి.. మార్పు రావాలి అనడానికి జీవన్ రెడ్డి ఎవరు..? అని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో జరిగిన అవినీతి గురించి అనేక సార్లు జీవన్ రెడ్డి విమర్శించారని మహేశ్ కుమార్ గౌడ్ ప్రస్తావించారు. వాటిని మరచి ఇవాళ జీవన్ రెడ్డి మాట్లాడడం సరికాదన్నారు. ఆయనకు ఇష్టం లేకపోతే చేసేదేమీ లేదని, కానీ విమర్శలకు కూడా ఓ హద్దు ఉండాలని అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై వస్తున్న ఆరోపణలపై మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడారు. పొంగులేటి అవినీతిపై ఆధారాలు ఉంటే చర్చకు రావాలని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. ఆధారాలు చూపిస్తే చర్యలు తప్పకుండా తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆధారాలు ఉంటే పట్టుకొని గాంధీ భవన్‌లో చర్చకు రావాలని సవాల్ విసిరారు. బట్ట కాల్చి మీద వేస్తామంటే కుదరదని హెచ్చరించారు. కేసీఆర్ హయాంలోని పదేళ్లలో అప్పటి మంత్రులు చాలా దోచుకున్నారని ఆరోపించారు. జేబులు నింపుకొని ఈరోజు తమ మంత్రులపై విమర్శలు చేస్తారా? అని ఆగ్రహించారు. ఆనాటి దోపిడీ గురించి కేసీఆర్ కూతురు కవిత చెబుతోందన్నారు. కేసీఆర్ హయాంలో నాసిరకం ప్రాజెక్టులు కట్టి డబ్బులు దోచుకున్నారని మహేశ్ కుమార్ గౌడ్ ధ్వజమెత్తారు.

## మూడు రాష్ట్రాల్లో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్..

మొదటిపేజీ తరువాయి...



ఎలాగైనా అధికారాన్ని హస్తగతం చేసుకోవాలని పట్టుదలతో ఉంది. ఇందిరా గ్యారెంటీలు వంటి వాగ్దానాలతో ఓటర్లను ఆకర్షిస్తోంది. ఎన్డీఏ, ఈసారి కేరళలో బలమైన ముద్ర వేయాలని చూస్తోంది. రాష్ట్రంలో మూడో ప్రత్యామ్నాయంగా ఎదగడమే లక్ష్యంగా ప్రచారం నిర్వహించింది. అస్సాంలో మరోసారి అధికారాన్ని నిలబెట్టుకునేందుకు బీజేపీ సర్వశక్తులు ఒడ్డింది. రాష్ట్రవ్యాప్తంగా జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించింది.

పోలింగ్ సరళిపైనే అందరి కళ్లు: కేరళలో పెన్షన్ల పెంపు, ఉచిత వైద్యం వంటి అంశాలు ఓటర్ల మనసు గెలుచుకోవడంలో కీలకం కానున్నాయి. పెరుగుతున్న నిరుద్యోగం, యువత వలసల అంశం ఈసారిఎన్నికల్లోచర్చనీయాంశంగా మారింది.మెట్రో విస్తరణ, విజింజం పోర్ట్ అభివృద్ధి వంటి ప్రాజెక్టులపై పార్టీల మధ్య హామీల యుద్ధం సాగింది. కాగా 2021 ఎన్నికల్లో 74.06 శాతం పోలింగ్ నమోదవ్వగా, ఈసారి ఆ శాతం పెరుగుతుందో లేదో అన్నది ఆసక్తికరంగా మారింది. పోలింగ్ శాతంలో వచ్చే స్వల్ప మార్పులు కూడా ఫలితాలను తారుమారు చేసే అవకాశం ఉందని రాజకీయ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ముఖ్యంగా ముందస్తు సర్వేలు ఏ పార్టీకీ స్పష్టమైన ఆధిక్యాన్ని ఇవ్వకపోవడంతో, సామాన్య ఓటరు తీర్పుపై ఉత్కంఠ నెలకొంది.

## నిప్పుల కొలిమిలా తెలంగాణ..

మొదటిపేజీ తరువాయి...



ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్: ముఖ్యంగా ఉమ్మడి ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఎండల తీవ్రత ప్రమాదకర స్థాయికి చేరుకునే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ నేపథ్యంలో ఈ రెండు జిల్లాలకు ఐఎండీ అధికారులు 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేశారు. ఇక్కడ ఉష్ణోగ్రతలు 43 నుంచి 44 వరకు నమోదయ్యే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది. రాష్ట్రంలోని మిగిలిన అన్ని జిల్లాల్లో కూడా ఎండ తీవ్రత అధికంగానే ఉంటుందని, అందుకే ఆ జిల్లాలకు 'ఎల్లో అలర్ట్' జారీ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. మధ్యాహ్నం వేళల్లో వేడి గాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు రాకపోవడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

## ఇంధన కొరత ఆందోళనల నేపథ్యంలో ఖతార్‌కు వెళుతున్న కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరి

మొదటిపేజీ తరువాయి...

ఈ ప్రకటన ప్రపంచ ఇంధన కొరత ఆందోళనకు దారితీసింది. ఖతార్ నుంచి ఎల్ఎన్జీని దిగుమతి చేసుకునే యూరప్, ఆసియా దిగుమతిదారులలో ఆందోళన నెలకొంది. పారిశ్రామిక ప్రయోజనాల కోసం వినియోగించే ఎల్ఎన్జీ కోసం భారత కంపెనీలు ప్రత్యామ్నాయం వైపు దృష్టి సారించాయి. అమెరికా, ఆస్ట్రేలియా, రష్యా నుంచి కొనుగోలు చేస్తున్నాయి. 2025లో భారత్ సుమారు 25.5 మిలియన్ టన్నుల ఎల్ఎన్జీని దిగుమతి చేసుకుంది. 2030 నాటికి దేశ ప్రాథమిక ఇంధన అవసరాల్లో సహజవాయువు వాటాను 15 శాతానికి పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

## తాత్కాలిక కాల్పుల విరమణ జరిగినా.. సైనిక బలగాలు ఇరాన్ చుట్టూ కొనసాగుతాయి

మొదటిపేజీ తరువాయి...

ఒకవేళ ఒప్పందాన్ని ఇరాన్ పాటించకపోతే మునుపెన్నడూ చూడని స్థాయిలో విరుచుకుపడతామని హెచ్చరించారు. హోర్ముజ్ జలసంధి మార్గం సురక్షితంగా ఉండాలని, నౌకాయానం నిరంతరం కొనసాగాలని అన్నారు. ఒప్పందం కుదిరేవరకు అమెరికా సైన్యం అక్కడే విశ్రాంతి తీసుకుంటూ, తమ తదుపరి మిషన్ కోసం ఎదురుచూస్తుందన్నారు. మరోవైపు తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఉన్నప్పటికీ, లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు భారీగా కొనసాగుతున్నాయి. ఇజ్రాయెల్ దాడుల్లో కనీసం 254 మంది మరణించినట్టు వార్తలు వస్తున్నాయి. 1,100 మందికి పైగా గాయపడ్డారని సమాచారం. ముఖ్యంగా బీరుట్, దక్షిణ లెబనాన్ ప్రాంతాల్లో నష్టం మరింత తీవ్రంగా ఉందని వార్తలు వస్తున్నాయి.

# పాకిస్థాన్‌పై మాకు నమ్మకం లేదు

మొదటిపేజీ తరువాయి...

న్యూఢిల్లీ, ఏప్రిల్9 : అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందానికి ఇజ్రాయెల్ కూడా మద్దతు పలికిన సంగతి తెలిసిందే. అయితే ఈ ఒప్పందంలో మధ్యవర్తిత్వ పాత్ర పోషించిన పాకిస్థాన్‌పై తమకు నమ్మకం లేదని ఆ దేశ రాయబారి పేర్కొన్నారు. భారత్‌లోని ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజార్ తాజాగా మాట్లాడుతూ.. శాంతి చర్చల్లో పాక్ పాత్రపై సందేహం వ్యక్తం చేశారు. పాకిస్థాన్‌ను తాము విశ్వసించలేమని, అమెరికా తన స్వప్రయోజనాల కోసం ఆ దేశాన్ని మధ్యవర్తిగా ఉపయోగించు కోవాలని నిర్ణయించుకుందని తాను భావిస్తున్నట్టు అజార్ పేర్కొన్నారు. ఏదేమైనా ఇరాన్‌లో తాము అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు అమెరికాతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే అమెరికా-మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందానికి ఇజ్రాయెల్ మద్దతు ఇస్తోందన్నారు. కాల్పుల విరమణ ఒప్పందం ఇరాన్ వరకే పరిమితం అని, లెబనాన్‌పై తమ దాడులు కొనసాగుతాయని ఇజ్రాయెల్ రాయబారి వెల్లడించారు. ఇరాన్‌పై జరిపిన ఆపరేషన్‌కు, లెబనాన్‌కు ఎలాంటి సంబంధమూ లేదని తెలిపారు. దక్షిణ లెబనాన్ ప్రాంతం నుంచి హెజ్‌బొల్లా మౌలిక సదుపాయాలను పూర్తిగా తొలగించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

# సంపాదకీయం

## యుద్ధ విరామం

ఇరాన్ యుద్ధంలో రెండు వారాలపాటు విరామం పాటించేందుకు అమెరికా అంగీకరించడం, ఇజ్రాయెల్ తలూపడంతో ప్రపంచం హమ్మయ్య అని ఊపిరి పీల్చుకున్నది. ఈ విరామం సంపూర్ణ యుద్ధ విరమణగా పరిణమించాలనే ఆకాంక్ష చమురు, వంటగ్యాస్ సంక్షోభం నుంచి ఇకనైనా విముక్తి లభిస్తుందేమోననే ఆశాభావం సర్వత్రా వ్యక్తమవుతున్న ది. అంతిమ ఫలితాల మాట అటుంచి ఈ యుద్ధ విరామమే ఓ కీలక మలుపు. ఇరాన్ దీనిని ఘన విజయంగా చెప్పుకోవడం, ఆ దేశ ప్రజలు వీధుల్లోకి వచ్చి హర్షామోదాలు తెలియజేయడం విశేషం. ఆ సంగతి అలా ఉంచితే, ఇప్పటివరకు జరిగిన పరిణామాల్లో ఎవరెక్కడ నిలుస్తారో, ఎవరేమిటో అంచనా వేసుకునేందుకు ఇది సరైన సమయం. ఈ యుద్ధాన్ని ఎగదోసింది ఇజ్రాయెల్ అయితే వెనుకా ముందూ చూసుకోకుండా, నిర్దుష్టమైన వ్యూహం, నికరమైన లక్ష్యం అంటూ ఏదీ లేకుండా దాడికి తెగబడ్డ అమెరికాకు ఘోర పరాభవాన్ని తెచ్చిపెట్టింది. ఇరాన్ విధించిన పది షరతులకు అగ్రరాజ్యాధినేత అధ్యక్షుడు ట్రంప్ బేషరతుగా తలొగ్గడమే ఇందుకు నిదర్శనం. అందులో అతి ముఖ్యమైనది హెర్ముజ్ జలసంధిపై ఇరాన్ ఆధిపత్యాన్ని ఒప్పుకుని, టోల్ చెల్లింపు ఏర్పాటుకు తలూపడం అమెరికా తలవంపులకు పరాకాష్ట. కా ల్పుల విరమణ షరతుల ప్రకారం హెర్ముజ్‌లో ఇరాన్ బలగాలు నౌకల రాకపోకలను నియంత్రిస్తాయి. అందుకుగాను టోల్ కూడా వసూలు చేస్తాయి. అంటే యుద్ధానికి ముందు జలసంధిలో స్వేచ్ఛగా విహరించిన నౌకలు ఇప్పుడు సుంకాలు చెల్లించుకోవాల్సి ఉంటుంది. ఇదీ ట్రంప్ దుస్సాహసిక యుద్ధం సాధించిన ఘనమైన ఫలితం! డొనాల్డ్ ట్రంప్ నిలకడ లేని మాటలతో అగ్రరాజ్యం విశ్వవేదికపై అపహాస్యం పాలైంది. ఆయన నిస్పృహకు గురై సభ్యసమాజం ఏమాత్రం ఆమోదించలేని బూతులకు లంకించుకోవడం, ఇరాన్ నాగరికతనే పూర్తిగా నేలమట్టం చేస్తానని హూంకరించడం వంటివి అమెరికాతోపాటుగా ప్రపంచ ప్రజలకు వెగటు పుట్టించాయి. అటు అగ్ర నాయకత్వాన్ని వరుసపెట్టి తుదముట్టిస్తున్నా చెక్కుచెదరని దీక్షతో, మొక్కవోని ధైర్యంతో నిలబడింది ఇరాన్. శత్రువు అంచనాలను తల్లకిందులు చేసి తెగించి పోరాడింది. గంటలు, రోజుల నుంచి యుద్ధం వారాలకు, నెలలకు పాకింది. ఓవైపు ఇజ్రాయెల్‌తో పాటుగా పశ్చిమాసియాలోని అమెరికా 'మిత్రదేశాల'పై క్షిపణుల వర్షం కురిపిస్తూ, పశ్చిమాసియా నౌకారవాణాకు ముఖద్వారమైన హెర్ముజ్‌పై ఇరాన్ పట్టు బిగించింది. అమెరికా యుద్ధ నౌకలను తరిమి కొట్టింది. హెర్ముజ్‌పై దాడికి నాటో దేశాలు, జపాన్ నిరాకరించడంతో అమెరికా ఒంటరి అయ్యింది. ట్రంప్ మొదలుపెట్టిన పనికిమాలిన యుద్ధం అందించిన ఫలితాల్లో ఇది ఒకటి. ఇక మరో ముఖ్య పరిణామం.. అమెరికా–ఇజ్రాయెల్ రెజీమ్ చేంజ్ (ప్రభుత్వ మార్పు) వ్యూహం బెడిసికొట్టడం. సర్వాధికారి అలీ ఖమేనీని హతమారిస్తే అతని కుమారుడు ఆ పదవిలోకి రావడం రెజీమ్ చేంజ్ కానేరదు. అగ్రనాయకత్వాన్ని మట్టుబెట్టినా ఇరాన్‌లో పరిపాలనా వ్యవస్థ చెక్కుచెదరకపోవడం గమనార్హం. అసలు సిసలు రెజీమ్ చేంజ్‌కు అమెరికాలో సన్నాహాలు జరుగుతుండటం చూస్తున్నాం. అమెరికా పరపతి, విశ్వసనీయత ఇరాన్ యుద్ధం కారణంగా ఘోరంగా దెబ్బతిన్నాయి. ఏకైక అగ్రరాజ్యాన్నని విర్రవీగే అమెరికా దురహంకారం క్షిపణి ఢీకొట్టిన ఆకాశహర్మ్యంలా కుప్పకూలింది. ఇజ్రాయెల్ ఆగర్భ శత్రువైన ఇరాన్‌ను నిర్వీర్యం చేయడం, చమురు సామ్రాజ్యాన్ని విస్తరించుకోవడం అనే ఒకే దెబ్బకు రెండు పిట్టలను కొట్టాలనే అత్యాశతో అమెరికా ఈ యుద్ధంలోకి దిగింది. దీని పర్యవసానం మన కండ్ల ముందే ఉన్నది. ఏది ఏమైనప్పటికీ ఇప్పటికైనా ఇరుపక్షాలూ ఆయుధాలను పక్కనబెట్టి దౌత్యానికి పనిచెప్పాలి. శాశ్వత శాంతి దిశగా అడుగులు వేయడం తక్షణావసరం.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మంత్రిగా పనిచేసిన ముద్దసాని దామోదర్ రెడ్డి కాంస్య విగ్రహాన్ని ఈ రోజు (09.04.2026) న సదాశివపల్లి చౌరస్తాలో ఆవిష్కరిస్తున్న సందర్భంగా ఆయన గురించిన కొన్ని జ్ఞాపకాలు గుర్తుకొచ్చాయి. పై పోటో హుజూరాబాద్ ఫిల్మ్ సొసైటీ 1987 నవంబర్ 14 నుండి 17 వరకు నిర్వహించిన బాలల చలన చిత్రోత్సవ ప్రారంభ సమావేశానికి మంత్రి హోదాలో ముద్దసాని దామోదర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిస్తున్న సందర్భం. ఫిల్మ్ సొసైటీ కార్యదర్శిగా ఆనాటి కార్యక్రమానికి నేను అధ్యక్షత వహించాను. పోటో శ్రీలో ముద్దసానికి కుడివైపు నేను, ఎడమవైపు కే.సి.క్యాంప్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నందమూరి సీతారామయ్య, కందుల ఆదిరెడ్డి (అప్పటి. హుజూరాబాద్ ఎంపీపీ), ఎస్.సుదర్శన్ ఫిల్మ్ సొసైటీ అధ్యక్షులు హుజూరాబాద్ లో టి.వి.లు నామమాత్రంగా ఉన్న ఆ రోజుల్లో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన నటులు చార్లీ చాప్లిన్ నటించిన"గోల్డ్ రష్", “గ్రేట్ డిక్టేటర్", “దకిడ్” మూడు మూకీ చిత్రాలను ఆనాటి హుజూరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల విద్యార్థులకు ఉచితంగా ప్రదర్శించడం జరిగింది. ఆనాటి సభలో ముద్దసాని ఫిల్మ్ సొసైటీ చేస్తున్న కృషిని ప్రశ్నించడం మా ఫిల్మ్ సొసైటీ సభ్యులందరికీ ఎంతో ఉత్సాహాన్ని కలిగించింది. తొమ్మిదేళ్ళ పాటు పట్టణంలోని అన్న పూర్ణ థియేటర్ యజమాని, నా సహవిద్యార్థి వట్టే కృష్ణారెడ్డి సహకారంతో అనేక ప్రయోగాత్మక చిత్రాలను సభ్యులకోసం ప్రదర్శించాం. తమిళ్ హీరో అర్జున్, హీరోయిన్ రాధ నటించిన ఒక తెలుగు చిత్రాన్ని (చిత్రం పేరు గుర్తుకు రావడంలేదు) మంత్రి హోదాలో ముద్దసాని దామోదర్ రెడ్డి మా సభ్యులతో కలిసి సినిమా పూర్తయ్యేంతవరకు వీక్షించారు. ఆ చిత్రం ఆయనకు అత్యంత ఇష్టమైనది కావడంతో నాకు లాండ్ పోన్ ద్వారా మాట్లాడి థియేటర్ కు వచ్చారు. ముద్దసాని ప్రజలతో మమేకమయ్యే తీరు ఆనాటి రాజకీయ నాయకులకు భిన్నంగా ఉండేది. అందుకే ఆయనను ఆనాటి యువ తరం ఒక రోల్ మాడల్ గా అభిమానించేది. నా సహ విద్యార్థి, కరీంనగర్ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ గా పనిచేసిన మేకల మధు సూదన్ రెడ్డి (మధు) ను ముద్దసాని అమితంగా అభిమానించేవారు. ఇంకొక విషయం ఇక్కడ ప్రస్తావించాలి.. ఎన్టీఆర్ ప్రభుత్వంలో సివిల్ సర్వీసెస్ మంత్రిగా పనిచేస్తున్న సందర్భంలో కమలాపూర్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో నిరవధిక సైకిల్ యాత్రను నిర్వహించారు. కమలాపూర్ నియోజకవర్గంలోని కేశవాపూర్ గ్రామం నుండి ముద్దసాని తన సైకిల్ యాత్రను ప్రారంభించారు. ఈ యాత్రను అప్పటి విద్యాశాఖ




# ముద్దసానితో అరుదైన జ్ఞాపకాలు

మంత్రిగా ఉన్న పటోళ్ల ఇంద్రారెడ్డి ప్రారంభించారు. ఆ రోజుల్లో కరీంనగర్ ఆంధ్రప్రభ, ఇండియన్ ఎక్స్ప్రెస్ పత్రికల స్టాఫ్ రిపోర్టర్ గా దేవులపల్లి అమర్ పనిచేసేవారు. ఇంద్రారెడ్డి, అమర్ ఇద్దరు ఉస్మానియా విద్యార్థులుగా సన్నిహిత స్నేహితులు కావడంతో కేశవాపూర్ నుండి ముద్దసాని ప్రారంభించే సైకిల్ యాత్ర ప్రారంభానికి నన్ను వెంటపెట్టుకుని దేవులపల్లి అమర్ కేశవాపూర్ గ్రామానికి వెళ్ళాడు. అమర్ అక్కడ నన్ను ఇంద్రారెడ్డికి పరిచయం చేయడం ఇప్పటికీ గుర్తుంది. ఆ ప్రారంభ కార్యక్రమ వార్తను నేనే రాసాను."కమలాపూర్ లో సైకిల్ పై “సై సై” అంటున్న ముద్దసాని” అన్నహెడింగ్ తో ఆంధ్రప్రభలో వచ్చిన ఆ వార్త ముద్దసాని దామోదర్ రెడ్డి ని ఆకట్టుకుంది. నేను కలిసినప్పుడల్లా ముద్దసాని నేను రాసిన వార్తను గుర్తుచేయడం నన్ను ఆ రోజుల్లో సంతోషపెట్టేది. సైకిల్ తెలుగుదేశం పార్టీ ఎన్నికల గుర్తు. సైకిల్ యాత్ర ప్రారంభమైన నాటి నుండి కొన్ని రోజుల పాటు నియోజకవర్గంలో తాను బస చేసే గ్రామాలకు ఉప్పల్ కు చెందిన తిరుపతిరావు, జాలి జనార్ధన్ రెడ్డి లను పంపించి జీపులో నన్ను, కేసరి యాదగిరి రావు (ఈనాడు)ను తప్పని సరిగా పిలిపించి, ఆ రోజటి సైకిల్ యాత్రా విషయాలను వివరించేవారు. ముద్దసాని దామోదర్ రెడ్డి ఆ రోజుల్లో అవినీతి అధికారులను మాత్రమే కాదు తన పార్టీకి చెందిన మంత్రులను కూడా వెంటపడి పరుగెత్తించిన సందర్భాలు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా ఉండేటివి. 1985, 89, 94, 99 లలో వరసగా నాలుగు సార్లు కమలాపూర్ ఎమ్మెల్యేగా గెలిచిన ముద్దసాని దామోదర్ రెడ్డి ఎన్టీఆర్, చంద్రబాబు ప్రభుత్వాలలో రెండు పర్యాయాలు మంత్రిగా పనిచేసి, 2004లో ఈటెల రాజేందర్ తో జరిగిన పోటీలో ఓటమి చెందారు. ముద్దసాని దామోదర్ రెడ్డి రాజకీయ చరిత్ర ఉమ్మడి కరీంనగర్ జిల్లా చరిత్రలో విలక్షణమైం దిగా చెప్పుకోవచ్చు. నేడు ఆయన విగ్రహ ఆవిష్కరణ సందర్భంగా ఇవి కొన్ని జ్ఞాపకాలు మాత్రమే... ఇంకా అనేక జ్ఞాపకాలు మది నిండా ఉన్నాయి...

**ముద్దసానికి నివాళులు...**

**ఆవునూరి సమ్మయ్య**

## నేపాల్‌లో గుట్కా ఉమ్మిన భారతీయులు..

# నీళ్లు పోసి కడిగించిన స్థానికుడు..



కాట్మండు: నేపాల్‌లో భారత పర్యాటకుల బృందానికి ఊహించని అనుభవం ఎదురైంది. వారు ప్రయాణిస్తున్న వాహనంలో నుంచి రోడ్డుపై గుట్కా ఉమ్మడంతో స్థానిక వ్యక్తి వారిని అడ్డుకుని నిలదీశాడు. వారితోనే ఆ ప్రదేశాన్ని శుభ్రం చేయించాడు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. నేపాల్‌లోని ఓ రహదారిపై వెళ్తున్న వాహనంలో నుంచి భారత పర్యాటకులు గుట్కా ఉమ్మడాన్ని ఓ స్థానిక వ్యక్తి గమనించాడు. వెంటనే వారి కారును ఆపి “ఇది ఇండియా కాదు సోదరా... ఇది నేపాల్... వెంటనే నీళ్లు పోసి కడగండి” అని హిందీలో గట్టిగా హెచ్చరించాడు. దీంతో పర్యాటకులు ఇబ్బంది పడుతూ పలుమార్లు క్షమాపణలు చెప్పారు. అయినా ఆ వ్యక్తి శాంతించలేదు. “మీరు అంత పెద్ద దేశం నుంచి వచ్చి ఇక్కడ ఇలా చెత్త చేస్తున్నారు” అంటూ, కేవలం క్షమాపణ చెబితే సరిపోదని, ఆ మరకలను శుభ్రం చేయాలని స్పష్టం చేశాడు. దీంతో పర్యాటకులు నీళ్లు పోసి ఆ ప్రదేశాన్ని శుభ్రం చేశారు. ఈ వీడియో ఆన్‌లైన్‌లో లక్షలాది వ్యూస్ సాధించడంతో నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. పౌర స్పృహ లేనివారికి తగిన బుద్ధి చెప్పాడంటూ చాలా మంది భారతీయుల సహా నేపాలీ వ్యక్తిని ప్రశంసించారు. అయితే మరికొందరు మాత్రం అతడి తీరును తప్పుబట్టారు. పర్యాటకులు క్షమాపణ చెబుతున్నా, దేశం పేరుతో నిందించడం సరికాదని, ఇది అతిథులను అవమానించడమేనని విమర్శించారు.

## ప్రధాన రహదారిపై

# అస్తవ్యస్తంగా పార్కింగ్ ప్రయాణికుల అవస్థలు



కోరుట్ల : కోరుట్ల పట్టణంలోని కల్లూరు రోడ్డుకు ఎదురుగా ఉన్న మెయిన్ రోడ్డుపై వాహనాల పార్కింగ్ క్రమపద్ధతిలో లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా భారీ వాహనాలు నిమిషాల తరబడి రోడ్డుపైనే నిలిపి లోడింగ్, అన్లోడింగ్ ప్రక్రియలు చేపట్టడం, దానికి తోడు వాహనాలను ఇష్టారాజ్యంగా పార్క్ చేయడంతో ట్రాఫిక్ స్తంభిస్తోంది. ఈ అస్తవ్యస్త పార్కింగ్ వల్ల నిత్యం రాకపోకలకు అంతరాయం కలగడమే కాకుండా, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి, నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులపై చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ క్రమబద్ధీకరించాలని ప్రజలు కోరుతున్నారు.

# దోపిడీ ఉన్నంతవరకు పోరాటాలు చేస్తాం

**పార్టీలో కుల వివక్షతకు తావులేదు**

**“మావో” పార్టీని లీగల్ గుర్తించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళాం**

**ప్రత్యక్ష ఎన్నికలలో నేను నిలబడను**

**అవమానాలకు గురవుతున్న పేదల గుండెల్లో “మావో” పార్టీ చిరస్మరణీయమవుతుంది**

**మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ తాజా మాజీ కార్యదర్శి తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీ**



కోరుట్ల తెలంగాణ వాణి (గంగుల రాంగోపాల్ సీనియర్ జర్నలిస్టు) ప్రజలు దోపిడీ గురవుతున్నంతవరకు మా పోరాటం ఉంటుందని, నాలుగు దశాబ్దాలుగా ఆయుధాన్ని పట్టుకొని పోరాతాలు చేశాం..ఎన్నో ఉద్యమాలకు మా పోరాటం నాంది పలికింది.. విజయాలే సాధించాశీ.. అంతిమ లక్ష్యం సుదీర్ఘంగా ఉందని, రూపాన్ని మార్చుకొని పోరాటాలు కొనసాగుతుందని మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ తాజా మాజీ కార్యదర్శి తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీ వెల్లడించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కోరుట్ల పట్టణంలో గురువారం విలేకరులతో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ తాజా మాజీ కార్యదర్శి తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీ మాట్లాడుతూ ప్రజాస్వామ్య బద్ధంగానే “లీగల్ ఫ్రేమ్లో” పోరాటం కొనసాగుతుందని, ఆయుధాన్ని పట్టుకొని నాలుగు దశాబ్దాలుగా పోరాటాలు చేశాం..ఎన్నో ఉద్యమాలకు మా పోరాటం నాంది పలికిందని వెల్లడించారు. 2012వ సంవత్సరంలో గడ్డు స్థితికి వెళ్లిపోయిందని సమీక్షించుకున్నా. పార్టీలో కుల వివక్షతకు తావు లేదని “క్యాస్ట ఫీలింగ్స్'' ఉండదని దేవుజీ అన్నారు. గడ్డు పరిస్థితిని అధిగమించడానికి పోరాట రూపాలు మారాయని దేవుజీ పేర్కొన్నారు. తెలంగాణ సమాజశీలో అవమానాలకు గురవుతున్న పేదల గుండెల్లో మా పార్టీ చిరస్మరణీయంగా ఉంటుందని దేవుజీ స్పష్టం చేశారు, లొంగిపోవడం అంటూ ఉండదని, జయాపజయాలు అనేవి ఉంటాయన్నారు. మా పార్టీని లీగల్ పార్టీగా గుర్తించాలని పాలకుల దృష్టికి తీసుకెళ్లామని అయితే ప్రత్యక్ష ఎన్నికల బరిలో నిలువబోనని దేవుజీ స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో చట్టబద్ధంగా లీగల్ గా పనిచేస్తాం అని మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ తాజా మాజీ కార్యదర్శి తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీ వెల్లడించారు.



## పోలీసు సిబ్బంది కుటుంబాలకు బాసటగా పోలీసు భద్రత స్కీమ్

### జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపిఎస్



సూర్యాపేట ఏప్రిల్ 9 (తెలంగాణ వాణి జిల్లా బ్యూరో ): సూర్యాపేట జిల్లాలో ఏఎస్ఐ గా విధులు నిర్వహిస్తున్న సత్యనారాయణ ఇటీవల ఆకాలంగా మృతి చెందినారు. మృతి చెందిన ఏఎస్ఐ సత్యనారాయణ, కుటుంబానికి పోలీసు భద్రత స్కీం యొక్క నగదు చెక్కు ను జిల్లా యస్.పి, కె. నరసింహ ఐపిఎస్ గారు జిల్లా పోలీస్ కార్యాలయం నందు అతని కుటుంబ సభ్యులకు అందజేసినారు.

పోలీసు శాఖలో పని చేస్తూ ఆకాలంగా ప్రాణాలు కోల్పోయిన సిబ్బంది కుటుంబాలను పోలీసు శాఖ అన్ని విధాలుగా, అదుకుంటుందని, దివంగత సిబ్బంది కుటుంబాలకు పోలీసు భద్రత స్కీమ్ బాసటగా నిలుస్తుంది అని అన్నారు. సత్యనారాయణ గారి కుటుంభం యొక్క సంక్షేమానికి కృషి చేస్తామని యస్.పి సభ ముఖంగా తెలిపినారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు కార్యాలయం అడ్మినిస్ట్రేషన్ అధికారి మంజు భార్గవి, పోలీసు సంఘం అధ్యక్షులు, ూ× రామచందర్ గౌడ్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచాన్ని బలి చేసిన ట్రంప్ యుద్ధోన్మాదం !



అమెరికా-ఇజ్రాయిల్ చేసిన యుద్ధంతో సాధించిందేమిటి? ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలను కుదేలు చేసిన ఈ ఇరు దేశాల నేతలు ఇప్పుడు చిద్విలాసంగానే ఉన్నారు. ఇరాన్‌ను సర్వనాశనం చేయాలని చూసి చేతులు కాల్చుకున్నారు. కానీ ప్రపంచ దేశాలు ఆయిల్, గ్యాస్ దొరక్క విలవిల్లాడాయి. ధరలు పెరిగాయి. విమానాలు రద్దయ్యాయి. ఎక్కడికి పోవాలన్నా విమాన ధరలు అందనంతగా పెరిగాయి. ఇంత విధ్వంసం చేసిన ట్రంప్ ..ఇప్పుడు తాత్కాలికంగా రెండు వారాలు యుద్ధాన్ని వాయిదా వేస్తున్నట్లుగా ప్రకటించారు. నిజానికి శాశ్వతంగా యుద్ధాన్ని ఆపేసి, ఇరాన్ సహా నష్టపోయిన దేశాల పునర్నిర్మాణంలో పాల్గొనాలి. ఇరాన్ అధినేత ఖమేనీని అంతమొందించి, ఇరాన్‌పై బాంబు దాడులు చేసి సాధించింది మాత్రం శూన్యం. ఓ రకంగా చెప్పాలంటే ఈ యుద్ధంలో ట్రంప్ ప్రథమ దోషి. తరవాతి స్థానం నెతన్యాహూది. వీరి యుద్ధ కాంక్షకు, నిరంకుశ వైఖరికి ప్రపంచ దేశాలు అల్లాడాయి. బాంబు దాడులకు ప్రతిస్పందనగా ఇరాన్ హార్ముజ్ జలసంధిని మూసివేసింది. దాంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అల్లకల్లోలమైపోతోంది. చమురు ధరలు పెరిగాయి. చమురు అందకుండా పోయింది. నౌకలు ఎక్కడిక్కడే నిలిచి పోయాయి. డాలర్ల లెక్కలో ముడిచమురు ధరలు పెరిగిపోయాయి. దాని వెనువెంటనే ఇతర దేశాల కరెన్సీల, ముఖ్యంగా ఆసియా దేశాల కరెన్సీల విలువలు పడిపోవడం మొదలైంది. దీని ఫలితంగా సంపన్న పెట్టుబడిదారీ దేశాలలో కన్నా ఎక్కువ మోతాదులో మూడవ ప్రపంచ దేశాలలో ద్రవ్యోల్బణం పెరిగిపోతోంది. ఇలా ద్రవ్యోల్బణం పెరిగిపోవడం వలన ప్రజల కొనుగోలు శక్తి హరించుకుపోతోంది. అందువలన ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఆర్థికమాంద్య ప్రమాదాన్ని ఎదుర్కొంటోంది. చమురుకు కొరత ఏర్పడినందువలన ఎరువుల ఉత్పత్తి తగ్గిపోయింది. దాంతో ఆ ఎరువుల కొరత ఏర్పడింది. దాని ఫలితంగా ఆహారధాన్యాల ఉత్పత్తి దెబ్బ తింటోంది. ముఖ్యంగా మూడవ ప్రపంచ దేశాలలో దుర్భర పరిస్థితుల మధ్య శ్రామిక ప్రజానీకం చిక్కుకుపోతున్నారు. ఇలా ట్రంప్ సాధించిన ఘనతలకు ఇవన్నీ నిదర్శనాలుగా చెప్పుకోవాలి. ఈ సంక్షోభానికి దారి తీసిన చట్టవిరుద్ధమైన, అనైతికమైన యుద్ధానికి ముగింపు తాత్కాలికం కారాదు. శాశ్వతంగా యుద్ధాన్ని ముగించేందుకు బేషరతుగా ట్రంప్ అడుగులు వేయాలి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో చమురు చాలా చిన్న విషయమే అయినా, చమురు ధరల పెరుగుదల ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఇంత స్థాయిలో ప్రభావం చూపడం చూస్తున్నాం. ఎందుకంటే చమురు చుట్టే అన్నీ పెనవేసుకుని ఉన్నాయి. సామ్రాజ్యవాద విస్తరణ, ఆక్రమణ యత్నాలకు ప్రధాన కారణం ముడిపదార్థాల మీద అదుపు సంపాదిం చడమేనని ఇప్పుడు వేరుగా చెప్పాల్సిన పనిలేదు. వెనెజువెలా తరవాత ఇరాన్‌పై దాడి సులభంగా అవుతుందనుకున్న ట్రంప్‌కు ఇదొక పెద్ద షాక్. ఇకముందు ప్రపంచ దేశాలపై దాడులు చేస్తే ఆయా దేశాలు ఎదురుదాడికి సిద్ధంగా ఉంటాయని ట్రంప్ బుద్ధి తెచ్చుకోవాలి. ప్రస్తుత పరిణామాలు ఈ విషయాన్నే బలపరుస్తున్నాయి. ప్రపంచ చమురు ఉత్పత్తుల్లో-ముడి చమురు మాత్రమే కాక దాని నుంచి వచ్చే వివిధ ఉత్పత్తులన్నీ కలుపుకుని-20 శాతం మాత్రమే హార్ముజ్ జల సంధి ద్వారా రవాణా అవుతుంది. రవాణాకు ఆటంకం ఏర్పడింది. ఇంత చిన్న విషయానికే ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఇంత పెద్ద స్థాయిలో సంక్షోభం తలెత్తిందంటే చమురు వంటి ముడిసరుకు ఎటువంటి కీలక పాత్ర పోషిస్తోందో బోధపడుతోంది. అంత కీలకమైన పాత్ర పోషించగలగడానికి కారణం చమురు విశ్వవ్యాప్త వాణిజ్య వస్తువు కావడమే అని గుర్తించాలి. అది ఆర్థిక ఇబ్బందులను సృష్టించగలిగే అవకాశం ఎక్కువగా కలిగి ఉంది. దాని ధర పెరగడం వలన కలిగే ద్రవ్యోల్బణ ప్రభావం అంతే తీవ్రంగా ఉంటుంది. ముడి చమురు ధరలో 10 శాతం పెరుగుదల ఉంటే కలిగే ప్రభావం తక్కువగా ఉంటుంది. ముడిచమురు ధరలో వచ్చే మార్పు ఆర్థిక వ్యవస్థ మీద ఇంతటి తీవ్ర ప్రభావాన్ని కలిగించగలదని ఈ నెల రోజుల్లో మనకు అనుభవంలోకి వచ్చింది.డాలర్ విలువ ముడిచమురు విలువతో ముడిపడిపోయి వుంది. అందుకే డాలర్ ఆధిపత్యం కొనసాగేందుకు అమెరికా డాలర్లను ముద్రించి విడుదల చేస్తోంది. ఆ డాలర్లను స్వీకరించడానికి, వాటి విలువను అంగీకరించడానికి ప్రపంచం కూడా సుముఖంగానే ఉంది. అందుచేత ఇప్పుడు ప్రపంచం అంతా డాలర్లు ఎక్కడబడితే అక్కడ ఉన్నాయి. ఈ పరిస్థితిలో డాలర్ ప్రమాణం ప్రశ్నార్థకంగా మారే పరిస్థితి దాపురిస్తే మొత్తం పెట్టుబడిదారీ ప్రపంచ స్థిరత్వమే ప్రమాదంలో పడుతుంది. అందుచేత చమురు-డాలర్ ప్రమాణాన్ని నిలబెట్టుకోవడం మరింత కీలకంగా మారింది. అలా నిలబెట్టుకోడానికే చమురును ఉత్పత్తి చేసే దేశాల మీద రాజకీయ ఆధిపత్యాన్ని చెలాయించడానికి అమెరికా పూనుకుంటోంది. అందుకే దాడులుకు తెగిస్తోంది. ముడి చమురుపై పెత్తనం కోసం చేస్తున్న యుద్ధంగా దీనిని యూడాలి. ఇరాన్‌లో ప్రభుత్వాన్ని గద్దె దించేసి తన తొత్తు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలనన్న ధీమాతో అమెరికా ఇరాన్ మీద దాడికి దిగింది. అయతుల్లా ఆలీ ఖమేనీతో సహా ఇరాన్ ఉన్నతాధికారులను అంతం చేసి,ఇరాన్‌ను తన చెప్పుచేతల్లోకి తెచ్చుకోవాలని, అందుకు ఇజ్రాయిల్‌ను వాడుకోవాలని అమెరికా చూసింది. తన డాలర్ సర్వాధిపత్యాన్ని మరింత బలపరుచుకోవాలన్న ఉద్దేశంతో అమెరికా చేసిన ఈ ప్రయత్నం బెడిసి కొట్టిందనే చెప్పాలి. అయితే ప్రపంచం మాత్రం మూల్యం చెల్లించుకుంది. ఇప్పటికైనా ట్రంప్ కళ్లు తెరవాలి. యుద్ధోన్మాదం నుంచి బయటపడాలి.

## నర్సరీలలోని ప్రతి మొక్కను సంరక్షించాలి

### - జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్



జగిత్యాల: ఏప్రిల్ 9 (తెలంగాణ వాణి ప్రతినిధి): నర్సరీలోని ప్రతి మొక్కను సంరక్షించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ అన్నారు. వెల్గటూర్ మండల కేంద్రంలో, స్తంభంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీలను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీలలో పెంచుతున్న మొక్కల స్థితిగతులను, వాటి సంరక్షణ విధానాలను ఆయన స్వయంగా పరిశీలించారు.నర్సరీలలో పెంచుతున్న వివిధ రకాల మొక్కల పెంపకం, వాటి ఎదుగుదలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు ఎన్ని మొక్కలు నాటారు, వాటి జీవన శాతం ఎలా ఉంది, భవిష్యత్తులో నాటేందుకు సిద్ధంగా ఉన్న మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మొక్కల సంరక్షణలో నిర్లక్ష్యం లేకుండా పర్యవేక్షణ చేయాలని సూచించారు. వేసవి కాలం అయినందున ఎండ తీవ్రత దృష్ట్యా నర్సరీలలో షేడ్ నెట్ లు ఏర్పాటు చేయాలని, సమయం ప్రకారం మొక్కలకు నీరందించాలని, సమయానుకూలంగా ఎరువులు వేసి మొక్కల ఎదుగుదలను సంరక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ప్రతి గ్రామంలో 100 మంది ఈజీఎస్ ఉపాధి హామీ కూలీలతో నర్సరీలలోని మొక్కలను పరిరక్షిస్తూ పర్యావరణ పరిరక్షించాలని అలాగే పూలు, పండ్లు, ఇతర నీడ నిచ్చే మొక్కల పెంపకం కీలకమని, నర్సరీలలో నాణ్యమైన మొక్కలను పెంచి సమయానికి నాటాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. నాటిన మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టి, వాటి జీవన శాతాన్ని పెంచే చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఆర్డీవో పీడీ రఘువరన్, తహసీల్దార్, ఎంపిడివో, ఎంపీ ఓ,స్థానిక సర్పంచులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యంతో అన్నదాల నిరీక్షణ



నిజామాబాద్, : మార్చి మూడో వారం నుంచే వరి కోతలు ప్రారంభమై ప్రస్తుతం వేగంగా సాగుతున్నాయి. రైతులు పెద్ద ఎత్తున ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్దకు తరలిస్తున్నప్పటికీ కొనుగోళ్లు జరగకపోవడంతో నిల్వ సమస్యలు తీవ్రంగా మారాయి.పదిహేను రోజులుగా రైతులు ధాన్యాన్ని కుప్పలుగా వేసి కొనుగోళ్ల కోసం ఎదురు చూస్తున్నా, ఇప్పటివరకు ఒక్క క్వింటాల్ కూడా అధికారికంగా కొనుగోలు కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఏర్పాటు చేయాల్సిన 22 ఐకేపీ, 5 పిఎసిఎస్, 3 మెప్మా కొనుగోలు కేంద్రాలు ఇంకా ప్రారంభం కాలేదు. గతంలో కేంద్రాలు ఏర్పాటు చేసిన ప్రదేశాల్లోనే రైతులు ధాన్యం రాశులు పోసి వేచి చూస్తున్నారు. ధాన్యం పండించి కోత కోసిన అన్నదాతలకు నిరీక్షణ తప్పడం లేదు. మండలంలోని పలు గ్రామాలలో గత పది, పదిహేను రోజుల నుండి వరి కోతలు మొదలయ్యాయి. వరి కోతలు మొదలై చేతికొచ్చిన పంటను కొనుగోలు కేంద్రాల వద్దకు తరలించి ఆరబోసుకున్నారు. ఇంకా కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడం అన్నదాతలను ఒకింత ఆందోళనకు గురి చేస్తుంది. మండలంలో దాదాపు 25 శాతం వరి పొలాలు కోతలు పూర్తయ్యాయి. అయినా ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదు.కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో కొంతమంది రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించి నష్టపోవాల్సిన పరిస్థితి వస్తోంది. ఇప్పటి వరకు మంగపేట మండలంలో ఎక్కడా కొనుగోలు కేంద్రాల ప్రారంభం ఊసే లేదు. దీనికి తోడు గత నాలుగు రోజులుగా వాతావరణంలో వచ్చిన మార్పులకు అన్నదాతలు మరింత ఆందోళనకు గురవుతున్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడం, వర్షాలు పడే అవకాశాలు కనబడుతుండడంతో కొనుగోలు కేంద్రాల వద్దకు ధాన్యాన్ని తీసుకువచ్చిన రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని రైతాంగం కోరుతుంది పలు గ్రామాలలో గత పది, పదిహేను రోజుల నుండి వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గత నాలుగు రోజుల నుండి ఆకాశం మబ్బుగా ఉంది. ఎప్పుడు వర్షం పడుతుందో తెలియని పరిస్థితి. వర్షం వస్తే కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న ధాన్యం తడిచిపోయే అవకాశం ఉంది. దీంతో రైతులకు నష్టం వాటిల్లుతుంది. మండలంలో ఒకటి, రెండు చోట్ల లాంఛనంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి పత్రికలకు ప్రకటనలు ఇవ్వడమే తప్ప మండలంలో ఇప్పటి వరకు ఎక్కడా ఒక్క బస్తా వడ్లను కూడా కొనలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి.

కలవరపడుతున్న రైతులు..: ఎండల కారణంగా తేమ శాతం అనుకూలంగా ఉన్నప్పటికీ, అకాల వర్షాల భయం రైతులను కలవరపెడుతోంది. ఇతర ప్రాంతాల్లో వారం రోజులక్రితమే ధాన్యంకేంద్రాలకు రాక ప్రారంభమైనప్పటికీ, కొనుగోళ్లు ఎక్కడా ప్రారంభం కాలేదని రైతులు చెబుతున్నారు. ధాన్యం కుప్పలుగా పేరుకుపోవడంతో వాటి రక్షణ కూడా సమస్యగా మారింది. ప్రస్తుత పరిస్థితుల ప్రకారం పూర్తిస్థాయిలో కొనుగోళ్లు ప్రారంభం కావడానికి ఇంకా సమయం పట్టే అవకాశముందని తెలుస్తోంది. ఇదే సమయంలో అకాల వర్షాలు, వడగండ్ల వానల ముప్పు ఉండటంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి తమను మండల రైతులు కోరుతున్నారు.వడ్లను గతంలో ధాన్యం కొనుగోలు చేసిన చోటుకు తీసుకువచ్చి 10రోజులుఅవుతోంది. కొనుగోలుకేంద్రంఎప్పుడు ప్రారంభిస్తారో తెలియట్లేదు.ఇప్పటి వరకు ఇక్కడఈ విధమైనఏర్పాట్లు చేయ లేదు ఈడ పరిస్థితి చూస్తుంటే ఇంకా సమయం పట్టేటట్టు ఉంది.

## రాయలసీమలో ఫ్యాన్ కు ఉక్కపోత




కర్నూలు, : వైసీపీ అధికారంలో లేదు. అందరూ కలసి కట్టుగా పార్టీని బలోపేతం చేయాల్సిన సమయం. అయితే రాయలసీమ నేతలు మాత్రం ఒకరినొకరు తిట్టుకుంటూ పార్టీ పరువును నడిబజారున పడేస్తున్నారు. పార్టీ హైకమాండ్ కూడా పెద్దగా పట్టించుకోకపోవడంతో మరింత సీమ వైసీపీ నేతలు రెచ్చిపోతున్నారు. రాయలసీమ వైసీపీలో నేతల మధ్య అంతర్గత విభేదాలు రచ్చకెక్కుతున్నాయి. ముఖ్యంగా కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో గ్రూపు రాజకీయాలు, టికెట్ల పంచాయితీలు పార్టీని ఇబ్బందుల్లోకి నెడుతున్నాయి.

పార్టీ అధినేత వైఎస్ జగన్ మాత్రం సీమ నేతల చిందులను చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు.ఎమ్మిగనూరులో చెన్నకేశవరెడ్డి, బుట్టా రేణుక వర్గాల మధ్య విభేదాలు తీవ్ర స్థాయిలో ఉన్నాయి. ఇరు వర్గాలు వేర్వేరుగా పార్టీ కార్యక్రమాలను నిర్వహించుకుంటున్నాయి. ఎమ్మిగనూరులో సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి కుటుంబానికి, మాజీ ఎంపీ బుట్టా రేణుక వర్గానికి మధ్య తీవ్ర ఘర్షణ నడుస్తోంది. కేడర్ రెండు వర్గాలుగా చీలిపోయింది. సింగనమలలో వర్గపోరు, కదిరిలో నేతల ఘర్షణలు తరచుగా రోడ్డెక్కుతున్నాయి. సింగనమల నియోజకవర్గంలో వైసీపీ నేతల అంతర్గత పోరుబహిరంగంగా బయటపడుతోంది. కదిరి నియోజకవర్గంలో వైసీపీ నేతలు చెప్పులతో కొట్టుకునే స్థాయికి విభేదాలు తీవ్రమయ్యాయి.ఇక అనంతపురం జిల్లాలోని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదర్తి ప్రకాశ్ రెడ్డి, ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డిల మధ్య విభేదాలు తారా స్థాయికి చేరుకున్నాయి. పార్టీ నుంచి సస్పెండ్ చేసిన వాళ్లను వెంటేసుకుని తిరుగుతున్నారంటూ తోపుదర్తి ప్రకాశ్ రెడ్డి ఫైర్ అయ్యారు. ఒకసారి పార్టీ మారిన వారిని పార్టీలోకి తీసుకుంటే చెప్పుతో కొడతానంటూ కేతిరెడ్డి మండిపడ్డారు. ఇలా నేతల మధ్య ర్గ విభేదాలు రాబోయే కాలంలో పార్టీ బలాన్ని తగ్గిస్తాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. నేతల మధ్య సమన్వయం లేకపోవడం, ఆధిపత్య పోరు స్థానిక సంస్థల ఎన్నికలు, ఇతర రాజకీయ కార్యకలాపాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశముందన్న ఆందోళన వ్యక్తమవుతుంది.

## అంతరిక్షం నుంచి సూర్యగ్రహణం ఎలా కనిపిస్తుందంటే..

## నాసా విడుదల చేసిన అద్భుత చిత్రాలు!



అంతరిక్షం నుంచి సూర్యగ్రహణం ఎలా ఉంటుందో కళ్లకు కట్టే అద్భుతమైన చిత్రాలను అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా విడుదల చేసింది. చంద్రుడిపైకి మనుషులను పంపించే లక్ష్యంతో ఇటీవల నిర్వహించిన 'ఆర్టెమిస్-2' మిషన్ ఈ అపురూప దృశ్యాలను బంధించింది. భూమిపై చంద్రుడి నీడ (ఛాయ) ఒక పెద్ద నల్లటి మచ్చలా కదులుతున్నట్లు చూపిస్తున్న ఈ ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ చిత్రాలను చూస్తుంటే హాలీవుడ్ సైన్స్ ఫిక్షన్ సినిమాలోని గ్రాఫిక్స్‌ను చూస్తున్నట్లుందని నెటిజన్లు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గ్రహణ సమయంలో భూమి అంచుల వెంబడి ప్రసరిస్తున్న కాంతి, మేఘాల మధ్య నుంచి కనిపిస్తున్న రంగులు మరో గ్రహాన్ని చూస్తున్న అనుభూతిని కలిగిస్తున్నాయని శాస్త్రవేత్తలు సైతం ఆశ్చర్యపోతున్నారు. మానవులను చంద్రుడిపైకి తీసుకెళ్లే బృహత్తర ప్రయోగంలో ఆర్టెమిస్-2 మిషన్ అత్యంత కీలకమైనది. ఇందులో భాగంగా వ్యోమగాములు చంద్రుడి చుట్టూ ప్రయాణించి భూమికి తిరిగి వస్తారు. ఈ మిషన్‌లో అమర్చిన అత్యాధునిక కెమెరాల ద్వారా ఈ చిత్రాలను తీశారు. ఇవి కేవలం అద్భుత దృశ్యాలు మాత్రమే కాదని, గ్రహణ సమయంలో భూవాతావరణంలో జరిగే మార్పులు, కాంతి ప్రసరణ వంటి అంశాలపై అధ్యయనం చేసేందుకు శాస్త్రవేత్తలకు ఎంతగానో ఉపయోగపడతాయని నాసా తెలిపింది. వేల కిలోమీటర్ల ఎత్తు నుంచి తీసిన ఈ ఫొటోలు సాంకేతిక విజయాన్ని చాటడమే కాకుండా, విశ్వంలోని అద్భుతాలను సరికొత్త కోణంలో వీక్షించే అవకాశాన్ని కల్పించాయని నాసా ప్రతినిధులు పేర్కొన్నారు.

## సర్కారీ కొలువుల్లేకపోయినా.. భారీగా ఉద్యోగాలు

హైదరాబాద్,: ఆసక్తికర లెక్కలు వెలుగు చూశాయి. తెలంగాణ రాష్ట్రం కొలువులకు కేరాఫ్ అడ్రస్ గా మారుతోంది. దేశ వ్యాప్తంగా ఉన్న ఐటీ కొలువులు మాత్రమే కాదు.. పారిశ్రామిక రంగాల విస్తరణతో పాటు.. కొత్త సంస్థలు కొలువు తీరటంతో పాటు.. సేవా రంగం భారీ ఎత్తున విస్తరిస్తున్న వేళ.. ఉపాధి కల్పనలో తెలంగాణ రాష్ట్రం దూసుకెళుతోంది. కాకి లెక్కలు కాకుండా.. ఉద్యోగులు ఎవరైనా సరే.. ఈపీఎఫ్ వో వద్ద నమోదయ్యే గణాంకాల ప్రకారం చూస్తే.. ఆశ్చర్యానికి గురి చేసే గణంకాలు తెర మీదకు వచ్చాయి. గడిచిన ఎనిమిది నెలల విషయాన్నే తీసుకుంటే.. దాదాపు 3.12 లక్షల మంది తొలిసారి ఉద్యోగాల్లో చేరినట్లుగా వెల్లడైంది. ఈ కొలువుల్లో అధిక నైపుణ్యం ఉన్న ఉద్యోగాలు మాత్రమే కాదు.. మధ్యస్థాయి కొలువులు సైతం గణనీయంగా పెరిగిన విషయం వెల్లడైంది. ఈ పెరిగిన కొలువుల్లో కీలకభూమిక పోషించింది మాత్రం హైదరాబాద్.. రంగారెడ్డి జిల్లాలే అని చెప్పాలి. ఈపీఎఫ్ వో గణాంకాల్ని పరిశీలిస్తే రాష్ట్రవ్యాప్తంగా 55.42 లక్షల మంది పని చేస్తున్నట్లు తేలింది. ఇందులో ఒక్క హైదరాబాద్.. రంగారెడ్డి జిల్లాల్లోనే 42.8 లక్షల మంది ఉండటం గమనార్హం. ఒక్క హైదరాబాద్ జిల్లాలోనే 31.39 లక్షల మంది ఉద్యోగులు ఉన్నట్లుగా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. హైదరాబాద్ మహానగరంలోని అత్యధిక ప్రాంతం ఈ రెండు జిల్లాల్లోనే ఉందన్న సంగతి తెలిసిందే. గడిచిన ఐదేళ్లలో దాదాపు 7.23 లక్షల మంది కొత్తగా ఉద్యోగాల్లోకి వచ్చారు. రంగారెడ్డి జిల్లాలో 4 లక్షల ఉద్యోగాలు వచ్చాయి. అదే సమయంలో నిజామాబాద్.. ఆదిలాబాద్ జిల్లాల్లో మాత్రం ఉద్యోగుల సంఖ్య కాస్త తగ్గింది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో (2025 ఏప్రిల్ 1 నుంచి 2026 మార్చి 31 వరకు మధ్యకాలం) కొత్తగా వచ్చిన ఉద్యోగాలు భారీగా వచ్చాయి. గడిచిన ఐదేళ్లలో వచ్చిన ఉద్యోగాల్లో దాదాపు 30 శాతానికి పైనే ఉండటం ఆసక్తికరంగా మారింది. ఇదంతా చూస్తే.. హైదరాబాద్ కొలువులకు నెలవుగా మారటమే కాదు.. మహానగర స్థాయి ఏమిటన్న విషయాన్ని చెప్పకనే చెప్పేస్తుందని చెప్పాలి.

### పేద విద్యార్థులకు గోల్డెన్ ఛాన్స్.. 26న మెగా గ్రాండ్ టెస్ట్

చౌటుప్పల్ : ఐఐటీ-జేఈఈ, నీట్, ఎంసెట్ వంటి ప్రతిష్టాత్మక పరీక్షల పై విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ లో రత్నం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 26 న ఉచిత మెగా గ్రాండ్ టెస్ట్ నిర్వహించనున్నారు. ఈ టెస్ట్‌కు సంబంధించిన కరపత్రాన్ని స్థానిక ఎమ్మార్వో వీరాబాయి గురువారం ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఎమ్మార్వో మాట్లాడుతూ రత్నం ఫౌండేషన్ పేద విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్న శిక్షణా కార్యక్రమం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఐఐటీ-జేఈఈ, నీట్, ఎంసెట్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. మంచి భవిష్యత్తు కోసం కష్టపడి చదవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రత్నం ఫౌండేషన్ చైర్మన్ యు.మల్లేష్, అధ్యాపక బృందం, రామయ్య, మల్లేశం, సనా మేడం, యాదాద్రి ఆర్టీఐ జిల్లా అధ్యక్షుడు దబాటి శేఖర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.





# వాహ్.. కోహ్ !

ఇంట్లో వండుకునేంత తీరిక లేదు. బయటి తిండి అరాయించుకునే శక్తి లేదు. ఆకలి బాధ తినకుంటే తప్పేది కాదు. వంటంటే చిన్న పని కాదు. కూరగాయలు కొనాలి. కడగాలి, తరగాలి... తినడానికే సమయం లేదంటే ఇన్ని పనులా? అనే ఉద్యోగినుల కోసం కొత్త పౌడర్లొచ్చాయ్. పప్పులోకి పాలకూర, చారులోకి టమాటా, తాలింపులోకి కరివేపాకు.. ఇలా ఏది కావాలంటే అది కడిగి, తరిగి, డీహైడ్రేట్ చేసి, పొడి చేసి, ప్యాక్ చేసి వంటింటికి వెజిటబుల్ పౌడర్లు చేరవేస్తున్నది కోహ్ ఫుడ్స్. కూరలే కాదు టిఫిన్స్ కోసం రెడీ మిక్స్‌లు అందిస్తున్నది కోహ్. ఉన్నత విద్యావంతులైన ముగ్గురు స్నేహితుల వంటింటి ప్రయోగం ఇలా మొదలైంది!కీర్తి ప్రియా బిట్స్ పిలానిలో బీ ఫార్మసీ చదివిన తర్వాత ఐఐఎం, కోల్‌కతాలో ఎంబీఏ చదివింది. అది పూర్తి కాగానే బ్యాంక్, స్టార్టప్ కంపెనీల్లో ఉద్యోగాలు చేసింది. బెంగళూరు, ముంబయిలో ఉద్యోగం చేసేటప్పుడు సేంద్రియ ఆహారం, పోషకాహారం పట్ల ప్రజల్లో అవగాహన పెరగడం గమనించింది. అంతేకాదు ఉద్యోగాలు చేసే మహిళలు పెరుగుతున్నారు. తక్కువ సమయంలో వంట చేసుకునేందుకు రెడీ మిక్స్‌లను కొంటున్నారు. గుడ్ ఫుడ్‌కి డిమాండ్‌కు తగ్గట్టే ధరలున్నాయి. ఇవే కీర్తిని ఆలోచనలో పడేశాయి. 'ఇంత ధర పెట్టి కొంటున్నాం. కానీ, రైతులకు మాత్రం ఈ లాభాలు దక్కవెందుకు?' అనుకున్నది. తాను చిన్నప్పుడు సెలవులకు ఊరికి (సూర్యాపేట జిల్లా తొండ తిరుమలగిరి) వెళ్లినప్పుడు రైతుల కష్టాలు దగ్గరగా చూసింది. పంటను అమ్మితే.. ఆ పంట కోయడానికి అయ్యే ఖర్చు కూడా రాకపోవడం గమనించింది.

కిచెన్ ఫార్ములేషన్స్: ఫార్మసీలో ఫార్ములేషన్స్ కీర్తికి ఇష్టమైన సబ్జెక్ట్. 'కుకింగ్ కూడా ఓ రకంగా ఫార్ములేషనే కదా. నాకున్న నాలెడ్జ్‌తో వెజిటబుల్ పొడులు తయారు చేసి రైతులకు మేలు చేయచ్చు' అనుకుంది. కానీ, ఇంట్లో అడ్డు చెప్పారు. 'పేరున్న ఇన్‌స్టిట్యూట్‌లో చదివి, పెద్ద కంపెనీల్లో జాబ్ చేయక...ఈ ప్రయోగాలు నీకెందుకు? ఉద్యోగమే బెస్ట్' అని సలహా ఇచ్చారు. అయినా కీర్తి తన ఆలోచనను మార్చుకోలేదు. ఆహార నిల్వ కోసం రసాయనాలు కలపకుండా, రుచి, రంగు కోసం రసాయనాలు జోడించకుండా సహజమైన ఆహారాన్ని మార్కెట్లోకి తేవాలనుకుంది. ఏదో చేయాలనే తపనతో స్టడీ మొదలుపెట్టింది. ఆహారాన్ని బాగా డీ హైడ్రేట్ చేసి (తేమ అయిదు శాతం మించకుండా) ఎక్కువ రోజులు నిల్వ ఉండేలా చేయడం తెలుసుకుంది. వాటిని ఈజీగా వాడుకునేలా మార్కెట్ చేయడం కోసం ఓ ప్రణాళిక సిద్ధం చేసుకుంది. సహజమైన ఆహారాన్ని మన శరీరం ఒక విధంగా సంగ్రహిస్తుంది. న్యూట్రియెంట్ సప్లిమెంట్స్‌ని మరోలా సంగ్రహిస్తుంది. ఈ సప్లిమెంట్స్‌కి బయో అవైలబిలిటీ చాలా తక్కువ. అదే సహజ ఆహారానికి బయో అవైలబిలి టీ ఎక్కువ. కాబట్టి మార్కెట్లో తప్పకుండా ఆదరణ ఉంటుందని ఆచరణకు సిద్ధమైంది. రైతులతో అవగాహన తొండ తిరుమలగిరి రైతులతో 'మీరు పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇస్తాను. వ్యవసాయం లాభసాటిగా మారుస్తాను. నేను చెప్పిన పద్ధతిలో సాగు చేయాలి' అని కీర్తి అడిగింది. రైతులతో అవగాహన చేసుకుని అదే గ్రామంలో పరిశ్రమ పెట్టింది. అప్పటికే వాణిజ్య పంటలతో నష్టపోయిన రైతులకు ఇదో లాభసాటి మార్గంగా కనిపించింది. అంతకుముందెన్నడూ సాగు చేయని బీట్‌రూట్, క్యారెట్ పంటలు వేయడం మొదలుపెట్టారు. వీటితోపాటే టమాటా, గోంగూర, కాకర లాంటి కూరగాయలు, ఆకుకూరల సాగులోకి దిగారు.

సహజమైన రుచులు: స్నేహితుల ఆర్థిక సహకారంతో కీర్తి కొత్త ప్రయాణం మొదలైంది. తిరుమలగిరిలో ప్రొడక్షన్ యూనిట్‌లో కోహ్ ఫుడ్స్ పేరుతో చిప్స్, కూరగాయల పొడుల తయారీకి పూనుకుంది. కూరగాయలు, ఆకుకూరలు కోసిన తర్వాత వాటికి బ్యాక్టీరియా, ఫంగస్ సోకకుండా స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ పాటించింది. వాటితో పొడులు, చిప్స్ తయారు చేశారు. తేమ అయిదు శాతానికి తక్కువగా ఉంటే సూక్ష్మ జీవులు పెరగవు. కాబట్టి ప్రిజర్వేటివ్స్ కలపాల్సిన అవసరం రాలేదు. సహజమైన రంగు, సువాసన, కమ్మదనం కస్టమర్స్‌ని ఆకర్షించాయి. ఒకసారి కొన్నవాళ్లు మళ్లీ మళ్లీ కొని ఆదరించారు. గోంగూర, కరివేపాకు, బీట్‌రూట్, క్యారెట్, టమాటా.. పొడులకు మంచి ఆదరణ వచ్చింది. పులుపు కోసం టమాటాలు కడిగి, తరిగి, వాటిని ఉడికించాల్సిన అవసరమే లేదు. ఏదైనా కూరలో టమాటా పొడి వేసుకుంటే క్షణాల్లో పులుపు వచ్చేస్తుంది. ఇడ్లీలోకి అదనపు పోషకాల కోసం క్యారెట్, బీట్‌రూట్, పాలకూర.. పొడులును వాడుకోవచ్చు. ఈ రెడీ మిక్స్‌కి ఆదరణ ఎంతగా వచ్చిందంటే ఇక్కడివాళ్లు పెద్ద మొత్తంలో కొని విదేశాల్లో ఉన్న తమ పిల్లలకు పంపిస్తున్నారు.

రీల్స్ టు రియల్ జర్నీ: ఇన్‌స్టాగ్రామ్‌లో రకరకాల ఆహార ఉత్పత్తుల గురించి రీల్స్ చేసే రోహిణీ దీప్తికి ఓ రోజు ఒక హ్యాంపర్ వచ్చింది. అందులో కోహ్ ఫుడ్స్ బీట్‌రూట్ ప్యాక్ ఉంది. ఇదెలా ఉంటుందో చూద్దామని ఇడ్లీలో కలిపింది. టేస్ట్, స్మెల్, కలర్ బాగున్నాయి. నేచురల్ ప్రొడక్ట్ కాబట్టి ఇంకా కొనాలని అనుకుంది. 'ఇంకా మీ ప్రొడక్ట్స్ ఏమున్నాయి?' అని ఇన్‌స్టాగ్రామ్‌లో రోహిణి పింగ్ చేసింది. 'నేనే ఫౌండర్‌ని' అంటూ కీర్తి రెస్పాండ్ అయింది. అలా ఇద్దరినీ బీట్‌రూట్ పొడి కలిపింది. 'కోహ్ ఫుడ్స్‌ని ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రమోట్ చేస్తారా?' అని కీర్తి అడిగింది.'సరే చేస్తాను. కానీ, ముందుగా మీ ఫ్యాక్టరీ చూశాకే' అని బదులిచ్చింది రోహిణి. రీల్స్ కోసం తిరుమలగిరిలో తయారీ యూనిట్‌కు వెళ్లింది. అక్కడ కార్మికులు కూరగాయలు శుద్ధి చేయడం నుంచి ప్రాసెస్ చేసి, ప్యాక్ చేసే వరకు చూసింది. ఆ తర్వాత గ్రామాల్లోని రైతులతో కలిసి చేస్తున్న సాగు గురించి తెలుసుకుంది. రోహిణీ బిట్స్ (హైదరాబాద్)లో మెకానికల్ ఇంజినీరింగ్, ఎకనామిక్స్‌లో పీజీ చదివింది. వ్యాపారం తనకూ ఆసక్తి ఉంది. అప్పటికే ఓ చిన్న కంపెనీ నడుపుతున్నది. కోహ్ ఫుడ్స్ రుచులే కాదు, బిజినెస్ మోడల్ నచ్చాక..'రీల్స్ సంగతి తర్వాత... నేనూ ఈ బిజినెస్‌లోకి వస్తాను. మనిద్దరం కలిసి ఎందుకు ప్రయాణం చేయకూడదు' అని అడిగింది రోహిణి. అలా ఇద్దరూ కలిసి కోహ్ ఫుడ్స్‌ని మరిన్ని ప్రొడక్ట్స్‌తో పెద్దది చేశారు. పెరిగిన ఉత్పత్తికి తగ్గట్టే మార్కెటింగ్ కూడా పెంచాల్సి వచ్చింది. ఈ టీమ్‌లోకి అజయ్ చేరాడు. తను ఐఐటీ బాంబేలో చదివాడు. కీర్తి, అజయ్ ఒకే కంపెనీలో ఉద్యోగం చేశారు. ఆ పరిచయంతో అజయ్ కోహ్ ఫుడ్స్‌లో జాయిన్ అయ్యాడు. కంపెనీ ఆపరేషన్స్ హెడ్ బాధ్యతలు చూసుకుంటున్నాడు.

టేస్టీ మిక్స్!: కోహ్ ఫుడ్స్ బ్రాండ్ పేరుతో రకరకాల కూరగాయలు, ఆకుకూరల పొడులను కస్టమర్లకు పరిచయం చేసేందుకు చాలాచోట్ల స్టాల్స్ పెట్టి, జనానికి కనిపించేలా ప్రదర్శిస్తూ, వాసన చూపిస్తూ కొత్త రుచులు పరిచయం చేశారు. కస్టమర్లే ఈ పొడులకు ప్రమోట్ చేయడంతో వినియోగదారుల సంఖ్యా పెరిగింది. ఇలా కొత్త కస్టమర్లే కాదు కొత్త ప్రాంతాల నుంచీ ఆర్డర్లు వస్తూ వ్యాపారం దేశమంతా విస్తరించింది. ఈ కామర్స్, ఆన్‌లైన్ ఆర్డర్లతో దేశంలో ఎక్కడికైనా పొడులను డెలివరీ చేస్తున్నారు. రిటైల్ వ్యాపారులు, ఆహార కంపెనీలు కూడా బల్క్ ఆర్డర్లు ఇవ్వడంతో కోహ్ పంట పండింది. అయితే కస్టమర్ల నుంచి కోహ్ నిర్వాహకులకు ఓ విన్నపం వచ్చింది. పొడులు కలుపుకొని వండుకుంటున్నాం. అదేదో మీరే రెడీ మిక్స్ తయారు చేసి ఇవ్వొచ్చు కదా' అని అడుగుతుంటే ఆ సెగ్మెంట్‌లోకీ అడుగుపెట్టారు. ఏడు రకాల పెసరట్టు మిక్స్‌లు తయారు చేశారు. 15 రకాల వెజిటబుల్ మిక్స్‌లు తీసుకొచ్చారు. కోహ్ ఫుడ్స్ కాన్సెప్ట్ నచ్చి, స్టార్టప్ ఇండియా ఇందులో పెట్టుబడులు పెట్టింది. దీనికి తోడు కోహ్ ఫుడ్స్ అనేక అవార్డులు గెలుచుకుంది! ఇలా ఈ ముగ్గురి ప్రస్థానం మూడు పొడులు ఆరు రెడీ మిక్స్‌లుగా ముందుకుసాగుతున్నది.

ఫార్మర్ టు కస్టమర్: మనవాళ్లు విదేశాల నుంచి దిగుమతి అయిన కూరగాయలు, పండ్లు ఎక్కువ ఖరీదుకి కొంటున్నారు. వాటిలో కంటే మన రైతులు పండించే పంటల్లోనే పోషకాలు ఎక్కువ. ఇంకొంతమంది కూరగాయలు, ఆకుకూరల్లో ఉన్న పోషకాలను వదిలేసి సప్లిమెంట్లను కొని నష్టపోతున్నారు. ఎగ్జోటిక్ వెజిటబుల్స్ మోజు పోవాలి. మన రైతుకు సరైన అవకాశాలు రావాలి. మేం నేచురల్ ఫార్మింగ్ చేసే రైతుల దగ్గర కొనుగోలు చేస్తాం. పంట వేసే ముందు సాయిల్ టెస్ట్ చేయిస్తాం. దానికి తగ్గట్టుగా రైతులకు సాగు సూచనలు చేస్తాం. మా ప్రొడక్ట్స్‌పై నో ప్రిజర్వేటివ్స్, నో ఆడిటివ్స్ ముద్రిస్తాం.

# జనగణన ప్రక్రియను నిర్ణీతకాలంలో పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్



జగిత్యాల (తెలంగాణ వాణి ప్రతినిధి): జనగణన ప్రక్రియను నిర్ణీతకాలంలో పూర్తి చేయాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు వెల్గటూర్ తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న జనగణన పనులను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు.ఈ సందర్భంగా కార్యాలయంలో కొనసాగుతున్న జనగణన ప్రక్రియపై అధికారుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు.జనగణన పనుల పురోగతిని సమీక్షించిన, ప్రతి వివరాన్ని ఖచ్చితంగా నమోదు చేయాలని, ఎటువంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్తగా పనులు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన మార్గదర్శకాల ప్రకారం సమాచార సేకరణ జరగాలని అన్నారు.

అలాగే జనగణన ప్రక్రియను నిర్ణీత కాలంలో పూర్తి చేయాలని, సంబంధిత సిబ్బంది సమన్వయంతో పనిచేసి లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. ఫీల్డ్ స్థాయిలో సేకరించే సమాచారం సమగ్రంగా ఉండేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శేఖర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నామినల్ మస్టర్ రోల్ కార్మికులకు పనికి తగ్గ వేతనం అందహించాలి

## జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్, ఏప్రిల్: 09(తెలంగాణ వాణి ప్రతినిధి): జిల్లాలో పనిచేస్తున్న నామినల్ మస్టర్ రోల్ (ఎన్ఎంఆర్) కార్మికులకు శ్రమకు తగ్గ వేతనం అందించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలోని తన ఛాంబర్ లో, గురువారం, ఎన్ఎంఆర్ వేజెస్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధ్యక్షతన సంబంధిత అధికారులతో నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా దినసరి కార్మికుల చేతనాల పెంపు గురించి చర్చించారు. 2024 – 25 సంవత్సరానికి గాను 15 శాతం, 2025 – 26 సంవత్సరానికి 10 శాతం, 2026 – 27 సంవత్సరానికి 5 శాతం వేతనాలు పెంచారు. కార్మికుల శ్రమకు తగిన వేతనం ఇవ్వడం ద్వారా వారిని గౌరవించినవారిమౌతామని కలెక్టర్ తెలిపారు. కార్మికులకు సంబంధిత వేతనములు అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్మిక శాఖ అధికారి రాజలింగు, సిపిఓ జీవరత్నం, డిఆర్డిఓ విజయలక్ష్మి, జెడ్పి సీఈవో శంకర్, ఈడి ఎస్సీ కార్పొరేషన్ శంకర్, బిసి సంక్షేమ అధికారి శ్రీనివాస్, ఆర్ అండ్ బి సుభాష్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబుతో ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్ భేటీ..

## కీలక సమస్యలపై వినతి



అమరావతి,: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడితో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని పలు కీలక సమస్యలను ఆయన సీఎం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఒక వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా నెల్లూరు, ఒంగోలు, బాపట్ల తీరప్రాంతాల్లోని మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను మాధవ్ సీఎంకు వివరించారు. పొరుగున ఉన్న తమిళనాడుకు చెందిన మత్స్యకారులు స్పీడ్ బోట్లతో ఏపీ జలాల్లోకి అక్రమంగా ప్రవేశించి మత్స్య సంపదను దోచుకుంటున్నారని తెలిపారు. దీనివల్ల స్థానిక మత్స్యకారుల జీవనోపాధి దెబ్బతినడంతో పాటు శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతున్నాయని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా, రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పనిచేస్తున్న హోంగార్డుల సంక్షేమం గురించి కూడా మాధవ్ ప్రస్తావించారు. మానవతా దృక్పథంతో హోంగార్డులకు అంతర్రాష్ట్ర బదిలీలు చేపట్టాలని కోరారు. ఈ సమస్య కారణంగా సుమారు 400 మంది హోంగార్డులు ఇబ్బందులు పడుతున్నారని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈ భేటీకి సంబంధించిన వివరాలను పీవీఎన్ మాధవ్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన సీనియర్ సిటిజన్ కార్డులు, 'ఆయుష్మాన్ వయో వందన కార్డ్'లను పలు ప్రైవేట్ ఆసుపత్రులు అంగీకరించడం లేదని, దీనివల్ల వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని కూడా తాను సీఎంకు విజ్ఞప్తి చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సమస్యలపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి, వాటిని పరిశీలించి శాశ్వత పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమాచారం.

# రబీ ధాన్యం కొనుగోలుకు పక్కా కార్యాచరణ సిద్ధం

## జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



పెద్దపల్లి (తెలంగాణ వాణి) : జిల్లాలో రబీ ధాన్యం కొనుగోలుకు పక్కా కార్యాచరణ సిద్ధం చేసి, లక్ష్యాలను సమయానికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో రబీ ధాన్యం కొనుగోలుపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్ డి వేణుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ జిల్లాలో సుమారు 4.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ధారించామని, ఏప్రిల్ లో కొనుగోలు ప్రారంభించి మే నెలాఖరు నాటికి పూర్తి చేయాలని సూచించారు. తేమ శాతం వచ్చిన వెంటనే 24 గంటల్లో ధాన్యం కొనుగోలు పూర్తి చేసి కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలని ఆదేశించారు. కొన్ని కొనుగోలు కేంద్రాలు కేటాయించని మిల్లర్లకు ధాన్యం పంపిస్తున్నట్లు గమనించామని, యాసంగి సీజన్‌లో ఇది పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఆకస్మిక వర్షాల నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్ కవర్లు సిద్ధంగా ఉంచాలని, అవసరమైన హమాలి కార్మికులను సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో హమాలి ఏర్పాట్లు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. తేమ ధాన్యాన్ని ముందుగా ఎత్తివేయాలని, ఎటువంటి వివక్ష లేకుండా కొనుగోలు జరగాలని స్పష్టం చేశారు. రామగిరి గ్రామ సభలో చిన్న రైతుల ధాన్యం ముందుగా కొనుగోలు చేయలేదని వచ్చిన ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకొని, ఈసారి అలాంటి పరిస్థితి రాకుండా చిన్న రైతులకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు.

నాణ్యమైన ధాన్యాన్ని 24 గంటలలోపు కేటాయించిన మిల్లులకు తరలించాలని, కొనుగోలు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. యాసంగి ధాన్యం కొనుగోలుకు అవసరమైన గన్ని సంచుల సరఫరాపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, ఎటువంటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ట్యాబ్‌ల ద్వారా 24 గంటల్లో 100శాతం ఆన్‌లైన్ నమోదు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రవీందర్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీనాథ్, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, జిల్లా సహకార అధికారి శ్రీ మాల, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్కూల్స్ దగ్గరకు స్వచ్ఛ రథాలు

విశాఖపట్టణం, : గ్రామాల్లో పరిశుభ్రతే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వచ్ఛ రథాలను ఏర్పాటు చేస్తోంది. వీటి ద్వారా పనికిరాని వస్తువులను సేకరిస్తూ.. వాటికి బదులుగా నగదు, నిత్యావసర వస్తువులు అందిస్తున్నారు. ఈ క్రమంలోనే అధికారులు మరో నిర్ణయం తీసుకున్నారు. ఈ స్వచ్ఛ రథాలను ఇళ్ల వద్దకే కాకుండా పాఠశాలల వద్దకు కూడా పంపిస్తున్నారు. విద్యార్థుల నుంచి పనికిరాని వస్తువులను సేకరించి.. అందుకు బదులుగా వారికి అవసరమైన అట్టలు, పుస్తకాలు, పెన్నులు అందిస్తున్నారు. అనకాపల్లి జిల్లాలో ప్రయోగాత్మకంగా ఈ విధానం అమలు చేస్తున్నారు.గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్ర వాతావరణం నెలకొల్పే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వచ్ఛ రథాలను తీసుకువచ్చింది. ఈ స్వచ్ఛ రథాలు ప్రతి వారం గ్రామాల్లోకి వెళ్తూ.. ఇంటింటి నుంచి చెత్త, పనికిరాని వస్తువులను సేకరిస్తూ ఉంటాయి. అందుకు బదులుగా ఉచితంగా నిత్యావసర సరుకులు అందిస్తుంటారు. ఈ స్వచ్ఛ రథం కాన్సెప్ట్‌ను కొన్నిచోట్ల ప్రయోగాత్మకంగా పరిశీలించగా.. మెరుగైన ఫలితాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఇప్పుడు చాలా చోట్ల స్వచ్ఛ రథాలను ఏర్పాటు చేస్తున్నారు. తాజాగా పాఠశాలల వద్దకు కూడా స్వచ్ఛ రథాలను తీసుకువస్తున్నారు.అనకాపల్లి జిల్లాలో ఇప్పటికే ఈ ప్రక్రియ ప్రారంభమైంది. వారంలో ప్రతి గురువారం పాఠశాలలను సందర్శిస్తున్న స్వచ్ఛ రథాల సిబ్బంది.. విద్యార్థులు తెచ్చిన పనికిరాని వస్తువులను సేకరించి, వాటి విలువను లెక్క గట్టి.. అందుకు బదులుగా పెన్నులు, పుస్తకాలు, అట్టలు అందిస్తున్నారు. ఇళ్లలోని పనికి రాని వస్తువులను తీసుకుంటున్న స్వచ్ఛ రథం సిబ్బంది.. వాటికి బదులుగా గ్రామస్థులకు నిత్యావసర సరుకులు అందిస్తున్నారు. అలాగే ఇప్పుడు గురువారం రోజున పాఠశాలల వద్దకు వెళ్లి.. స్కూలు ఉపాధ్యాయులు, విద్యార్థుల వద్ద నుంచి ప్లాస్టిక్ వస్తువులు, లోహపు వస్తువులను స్వీకరించి.. మార్కెట్ ధరకు అనుగుణంగా నగదు లేదా అవసరమైన సరుకులు అందిస్తున్నారు. అలాగే విద్యార్థులకు అవసరమైన అట్టలు, పెన్నులు, పుస్తకాలు అందిస్తున్నారు.మరోవైపు స్వచ్ఛ రథం సిబ్బంది కేజీ ఇనుముకు రూ.20, పాత పేపర్లకు రూ.15, పుస్తకాలు, అట్టపెట్టెలకు రూ.10, కేజీ ప్లాస్టిక్ సీసాలు రూ.20, అల్యూమినియం వస్తువులు అయితే రూ.120 చొప్పున చెల్లిస్తున్నారు. వీటికి బదులుగా కొబ్బరి నూనె, సబ్బులు, ఉల్లిపాయలు, గోధుమ పిండి, కందిపప్పు వంటి నిత్యావసర సరకులు అందిస్తున్నారు. సరకులు అవసరం లేని వారికి నగదు అందిస్తున్నారు. మరో వైపు పాఠశాలల్లో ఎక్కువగా పొడి చెత్త ఉత్పన్నం అవుతోంది. దీని వలన పర్యావరణానికి ఇబ్బంది కలుగుతుందనే ఉద్దేశంతో స్కూళ్ల వద్దకు కూడా స్వచ్ఛ రథాలను తీసుకువస్తున్నారు. అనకాపల్లి జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగానూ ఈ విధానాన్ని అమలు చేసే ఆలోచనలో అధికారులు ఉన్నారు.



# నూతన కాలనీలకు మంచి నీరు అందించండి

## జలమండలి ఎండి అశోక్ రెడ్డిని కోరిన ఎమ్మెల్యే జిఎంఆర్

పటాన్ చెరు (తెలంగాణ వాణి రిపోర్టర్): పటాన్ చెరు నియోజకవర్గంలోని జలమండలి పరిధిలో గల నూతన కాలనీలకు సైతం రక్షిత మంచినీరు అందించేందుకు నిధులు కేటాయించాలని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి జలమండలి ఎండి అశోక్ రెడ్డిని కోరారు. గురువారం హైదరాబాద్ లోని జలమండలి కార్యాలయంలో ఎండి అశోక్ రెడ్డి ని కలిసి వివిధ అంశాలపై చర్చించారు. ప్రధానంగా అమీన్పూర్ డివిజన్ పరిధిలోని కిష్టారెడ్డిపేట గ్రామం, రాజరాజేశ్వరి కాలనీ ఫేజ్ 2, సృజన లక్ష్మీ కాలనీ ఫేజ్ 4, టైలర్స్ కాలనీ, లింగమయ్య కాలనీ, కె ఎస్ ఆర్ కాలనీలలో మంచినీటి సరఫరా లేకపోవడంతో ప్రజల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుత వేసవి కాలంలో ప్రతి రోజు ట్యాంకర్లను ఆశ్రయించాల్సి వస్తుందని తెలిపారు. పైన పేర్కొన్న కాలనీలలో నూతన పైపులైన్ల ఏర్పాటు కోసం ఇప్పటికే ప్రతిపాదనలు తయారు చేయడం జరిగిందని, రెండు కోట్ల నిధులు మంజూరు చేస్తే నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎండి అశోక్ రెడ్డి వితి త్వరలో నిధుల మంజూరుకు ఆదేశాలు జారీ చేస్తామని తెలిపినట్లు ఎమ్మెల్యే జిఎంఆర్ పేర్కొన్నారు.

# ఎమ్మెల్యే పల్లాను బురిడీ కొట్టించిన సైబర్ నేరగాడు



కేంద్ర పథకం చెప్పి లక్ష రూపాయాలు లూటీ పోలీసులను ఆశ్రయించిన జనగామ ఎమ్మెల్యే

జనగామ, ఏప్రిల్9 : ఇప్పటి వరకు అనేకమందిని బురిడీ కొట్టించిన సైబర్ నేరగాళ్లు తాజాగా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సైబర్ నేరస్థుడి చేతిలో మోసపోయారు. ఆయన నుంచి ఓ సైబర్ నేరస్థుడు రూ.లక్ష కొట్టేశాడు. ఈనెల 5నహైదరాబాద్‌లో ఉన్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరెడ్డికి ఓ అపరిచిత వ్యక్తి ఫోన్ చేసి.. తాను ఫైనాన్స్ అడిషనల్ సెక్రటరీ అంటూ పరిచయం చేసుకున్నాడు. ఓ కేంద్ర ప్రభుత్వ పథకం ద్వారా నిరుద్యోగ యువతకు రూ.10 లక్షల వరకు రుణాలు ఇచ్చే అవకాశం ఉందని ఎమ్మెల్యేకు చెప్పాడు. దీనికిగాను ఒక్కొక్కరికి రూ.2500 చెల్లించాలని నమ్మబలికాడు. దీంతో తన నియోజకవర్గంలోని యువతకు ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో సదరు అపరిచిత వ్యక్తికి ఎమ్మెల్యే పల్లా.. రూ.లక్ష ఫోన్ పే చేశారు. ఆ తర్వాత ఫైనాన్స్ అడిషనల్ సెక్రటరీకి ఫోన్ చేసి డబ్బులు వచ్చాయా? అని అడిగారు. డబ్బులు రాలేదని ఆయన సమాధానం చెప్పడంతోపాటు అసలు తాను ఫోన్ చేయలేదని తెలిపారు. దీంతో మోసపోయినట్లు గుర్తించిన ఎమ్మెల్యే పల్లా.. జూబ్లీహిల్స్ పీఎస్ సైబర్ క్రైమ్ విభాగంలో ఫిర్యాదు చేశారు. ఈ రకంగా బీఆర్ఎస్ జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి సైబర్ నేరగాళ్ల బారిన పడటం ఇప్పుడు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. స్వయంగా ఒక ప్రజాప్రతినిధిని, అది కూడా ప్రభుత్వ ఉన్నతాధికారి పేరుతో సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టించారు. సైబర్ కేటుగాళ్లు ఇప్పుడు కేవలం సామాన్యులనే కాకుండా, అత్యున్నత పదవుల్లో ఉన్న వారిని కూడా లక్ష్యంగా చేసుకుంటున్నారని ఈ ఘటన స్పష్టం చేస్తోంది. ఎమ్మెల్యే వంటి బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వారే మోసపోయారంటే, సామాన్యులు ఎంత అప్రమత్తంగా ఉండాలో ఈ ఘటన ద్వారా అర్థం చేసుకోవచ్చు. సైబర్ నేరాల పట్ల అవగాహన పెంచుకోవడమే దీనికి ఏకైక పరిష్కారమని పలువురు చెబుతున్నారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డికి ఓ గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి, తనను తాను తెలంగాణ ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ అడిషనల్ సెక్రటరీ అనంతరామిరెడ్డిగా పరిచయం చేసుకున్నాడు. ప్రభుత్వ యంత్రాంగంలో కీలక పదవిలో ఉన్న వ్యక్తిగా నమ్మించడంతో ఎమ్మెల్యే సదరు వ్యక్తి మాటలను విశ్వసించారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన 'వికసిత్ భారత్' పథకం కింద ఒక్కొక్కరికి రూ.10 లక్షల వరకు రుణాలు ఇస్తామని నిందితుడు నమ్మించాడు. నియోజకవర్గంలో 40 మంది అర్హులైన లబ్దిదారుల జాబితాను పంపాలని, దరఖాస్తుకు ఈరోజే చివరి రోజని ఎమ్మెల్యేపై ఒత్తిడి పెంచాడు. ఒక్కో దరఖాస్తు ప్రాసెసింగ్ ఫీజు కింద రూ.2,500ల చొప్పున, మొత్తం 40 మందికి కలిపి రూ. లక్ష తక్షణమే ఫోన్ పే చేయాలని కోరాడు. ప్రజలకు మేలు జరుగుతుందనే ఉద్దేశంతో ఎమ్మెల్యే గంట వ్యవధిలోనే ఆ లక్ష రూపాయలను నిందితుడు చెప్పిన నంబర్‌కు బదిలీ చేశారు. డబ్బులు పంపిన తర్వాత సదరు వ్యక్తి నుంచి ఎలాంటి స్పందన రాలేదు. దీంతో అనుమానం వచ్చి ఆరా తీయగా అది నకిలీ కాల్ అని తెలియడంతో ఎమ్మెల్యే జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించారు. సైబర్ నిందితులపై ఈ క్రింది సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కేసులు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. ఉన్నతాధికారుల పేర్లతో ఫోన్ కాల్స్ వచ్చినప్పుడు, వెంటనే నగదు బదిలీ చేయకుండా సంబంధిత శాఖల ద్వారా క్రాస్ చెక్ చేసుకోవాలని పోలీసులు సూచించారు. ఏ ప్రభుత్వ పథకానికి కూడా వ్యక్తిగత ఫోన్ పే నంబర్లకు డబ్బులు పంపాలని అధికారులు కోరారని అన్నారు. చెల్లింపులు ఎప్పుడూ అధికారిక పోర్టల్స్ లేదా చలాన్ల ద్వారానే జరుగుతాయని తెలిపారు. ఇలాంటి అనుమానాస్పద కాల్స్ వస్తే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేసి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

## వ్యతిరేక వార్తలు వస్తే దాడులు చేయడం సరికాదు

**శాంతియుత నిరసనలతో ఖండించాలి**

**మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు**



చిత్తూరు, ఏప్రిల్9 : పత్రికల్లో, మీడియాల్లో ఏమైనా అసత్య ప్రసారాలు వస్తే వాటిపైన శాంతియుతంగా నిరసనలు తెలిపే హక్కు ఉందని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు వ్యాఖ్యానించారు. అలాగే వాటికి ఖండనలు ఇచ్చి తమ నిరసనలు తెలప వచ్చన్నారు. అలా కాకుండా మీడియాపై భౌతిక దాడులకు పాల్పడటం మంచి పద్ధతి కాదని పేర్కొన్నారు. మీడియా స్వేచ్ఛకు విఘాతం కల్పించే చర్యలకు పాల్పడటం ఏ రాజకీయ పార్టీలకైనా తగదని అన్నారు. పత్రికా స్వేచ్ఛపై భౌతిక దాడులకు పాల్పడితే ఏ రాజకీయ పార్టీ అయినా సరే ఆ చర్యలను తాను తీవ్రంగా ఖండిస్తున్నానని చెప్పారు. గురువారం చిత్తూరులోని ఎస్పీ సావిత్రమ్మ ప్రభుత్వ మహిళ కళాశాల స్నాతకోత్సవానికి వెంకయ్య నాయుడు హాజరయ్యారు. కళాశాల ఆవరణలో చిత్తూరు మాజీ ఎంపీ చంగల్రాయ నాయుడు సహకారంతో నూతనంగా నిర్మించిన మహిళ వసతి భవనానికి ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడారు. మాతృభాషను మరిస్తే అమ్మను మరిచినట్లేనని వెంకయ్యనాయుడు వ్యాఖ్యానించారు. జన్మనిచ్చిన తల్లి ఊరు, దేశాన్ని ఎవరు మరువకూడదని చెప్పుకొచ్చారు. విద్యార్థులు యువత సోషల్ మీడియా ఊబిలో పడవద్దని సూచించారు. మనిషి జీవన ప్రమాణం మెరుగుపడాలంటే అందుకు అనుగుణంగా ఆహారపు అలవాట్లను కొనసాగించడం మంచిదని అన్నారు. విద్యార్థులకు మొదటి ప్రాధాన్యం చదువుతోపాటు ఆటలకు ఇవ్వాలని సూచించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆరోగ్యం కోసం తీసుకువచ్చిన యోగా కార్యక్రమాన్ని ప్రపంచ దేశాలు స్వాగతించాయని.. అమలు చేయడానికి శ్రీకారం చుట్టాయని ప్రస్తావించారు. తాను రాజకీయ వారసత్వానికి వ్యతిరేకినని.. కానీ సేవా కార్యక్రమాలు కొనసాగించే కుటుంబాల వారసత్వాన్ని ప్రోత్సహిస్తానని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.

## ఇంధన ధరలు తగ్గుతాయా?

**ఇప్పుడిప్పుడే సాధ్యం కాదంటున్న నిపుణులు**




న్యూఢిల్లీ: ఇరాన్‌పై కొనసాగుతున్న యుద్ధానికి తాత్కాలికంగా బ్రేక్ పడింది. అమెరికా–ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందంతో చమురు రవాణాకు అత్యంత కీలకమైన హెర్ముజ్ జలసంధి తిరిగి తెరుచుకోనున్నది. దీంతో ఇటీవల భగ్గుమన్న ముడి చమురు ధరలు.. నేటి కాల్పుల విరమణ తర్వాత అమాంతం దిగొచ్చాయి. అదే విధంగా భారత్‌లోనూ ఇంధన ధరలు తగ్గుతాయా? అంటే కాదనే సమాధానం వస్తున్నది. యుద్ధ సమయంలో హెర్ముజ్‌ను ఇరాన్ మూసివేయటంతో చమురు సరఫరాకు ఆటంకం ఏర్పడింది. దీంతో క్రూడాయిల్ ధర వేగంగా పెరిగింది. సీజ్‌ఫైర్ ప్రకటనతో ఇప్పుడు అంతర్జాతీయ ముడి చమురుధరలు దాదాపు 13–14శాతం వరకు పడిపోయాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 95 డాలర్లుకు దిగొచ్చింది. దీంతో దేశీయంగానూ చమురు ధరలు తగ్గుతాయనే భావన వ్యక్తమైంది. కాల్పుల విరమణతో నౌకల ప్రయాణం మొదలైతే దేశీయంగా కొరత భయాలు లేనట్టే. కానీ,ఆ ప్రభావం రిటైల్ మార్కెట్లో కన్పించకపోవ చ్చునని నిపుణులు చెబుతున్నారు. హెర్ముజ్ జలసంధి తెరుచుకున్నా.. చమురు సరఫరా ఇంతకు ముందులా లేదు. బీమా, రవాణా ఖర్చులు అధికంగా ఉన్నాయి. కాబట్టి ఇంధన ధరలు ఇప్పట్లో తగ్గే సూచనలు లేవు.

# ముద్దసాని ఆశయాలను కొనసాగిస్తాం

**రైతులు,పేద ప్రజల కోసం నిరంతరం పరితపించిన నాయకుడు**

**వచ్చే 15వ వర్ధంతి నాటికి జమ్మికుంటలో విగ్రహం**

**దామోదర్ రెడ్డి విగ్రహావిష్కరణ సభలో**

**ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు**





కరీంనగర్ (తెలంగాణ వాణి ప్రతినిధి): రైతుల కోసం, పేద ప్రజల సంక్షేమం కోసం దివంగత ముద్దసాని దామోదర్ రెడ్డి నిరంతరం కృషి చేశారని, ఆయన ఆశయాలను సదా కొనసాగిస్తామని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. వచ్చే ఏడాది జరగనున్న 15వ వర్ధంతి కార్యక్రమం రోజున జమ్మికుంటలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసి పదివేల మందితో సభ నిర్వహిస్తామని ఆయన స్పష్టం చేశారు. మాజీ మంత్రి, దివంగత ముద్దసాని దామోదర్ రెడ్డి 14వ పురస్కరించుకొని మానకొండూరు మండలం సదాశివ పల్లి జంక్షన్ లో నెలకొల్పిన ఆయన వర్ధంతిని పురస్కరించుకుని గురువారం ఆయన కాంస్య విగ్రహాన్ని మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్య నారాయణతో కలిసి ఆవిష్కరించారు. సర్దార్బంగా ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అలుగునూరు లోని శ్రీ లక్ష్మీ నరసింహ కన్వెన్షన్ లో నిర్వహించిన ముద్దసాని దామోదర్ రెడ్డి వర్ధంతి సభ నిర్వహించారు. టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సభకు ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విజయ రమణారావు మాట్లాడుతూ పేద ప్రజలు, కార్యకర్తల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న

దామోదర్ రెడ్డి విగ్రహాన్ని ఎప్పుడో ఏర్పాటు చేయాల్సి ఉండేదని,అనివార్య కారణా లవల్ల కార్యరూపం దాల్చ లేదన్నారు.ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు నాయకత్వం వహించి న దామోదర్ రెడ్డి ఎంతో మంది నాయకులను తీర్చిదిద్దారని అన్నారు. తనతో పాటు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్,కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎమ్మెల్యే రామ్ రెడ్డి లను ఎమ్మెల్యేలను చేసిన ఘనత దామోదర్ రెడ్డి కే దక్కుతుందన్నారు.దామోదర్ రెడ్డి వల్లనే తాను ఈ స్థాయికి వచ్చానని విజయ రమణా రావు సగర్వంగా చెప్పారు. ప్రజలతో,పార్టీ నాయకులు కార్యకర్తలతో ఎలా ఉండాలో, వారికి దగ్గరగా ఉండి ఎలా పనులు చేయాలో దామోదర్ రెడ్డిని చూసి నేర్చుకున్నానని తెలిపారు.మా సోదరుడు చనిపోతే తమకు దగ్గరుండి పని చేశారని గుర్తు చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా ప్రతిపక్ష హోదాలో ఉన్నటువంటి ఏకైక ఎమ్మెల్యే ముద్దసాని దామోదర్ రెడ్డి అని,1994లో జరిగిన ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకుని రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చేందుకు కృషి చేశారని కొనియాడారు. నిరంతరం ఆయన బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం, రైతుల కోసం కృషి చేశారని అన్నారు.కమలాపూర్ నియోజకవర్గంలో ఒక్క మడి కూడా ఎండకుండా కాలువ ద్వారా నిరంతరం నీళ్లు పారించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు.ఆనాడు గ్రామాల్లో నక్సలైట్ల ఉద్యమం కొనసాగుతున్న సందర్భంలో చాలామంది యువకులు గ్రామాల్లో ఉండలేని పరిస్థితి నెలకొన్నదని తెలిపారు.పార్టీ కార్యకర్తలు ఎన్కౌంటర్ల పాలు కాకుండా,పోలీసు దెబ్బలు తినకుండా కంటికి రెప్పలా కాపాడుకున్నారని గుర్తు చేశారు.తనను నమ్ముకున్న పార్టీ నాయకులు, కార్యకర్తలకు,ప్రజలకు న్యాయం చేశారని అన్నారు. ఆయన ఒక్క పిలుపు ఇస్తే పదివేల మంది కార్యకర్తలు ఒక చోటికి చేరేవారన్నారు. కమలాపూర్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీకి కంచుకోటలా తయారు చేశారని,ఇప్పటికీ ఆ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలవలేదని అన్నారు. రెండు దశాబ్దాల పాటు వరుస విజయాలతో దూసుకుపోయిన దామోదర్ రెడ్డి,2004 ఎన్నికల్లో అనారోగ్య కారణాల వల్లనే ఆయన ఓటమి చెందారని తెలిపారు.దామోదర్ రెడ్డి భౌతికంగా లేకపోయినా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని,ఆయన గురించి తలవని ఊరు, మనిషి లేదని అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం అందరం కలిసికట్టుగా పనిచేయాలని విజయ రమణారావు పిలుపునిచ్చారు.

పేద ప్రజల పక్షపాతి దామోదర్ రెడ్డి: మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ

రెండు దశాబ్దాల పాటు సుదీర్ఘకాలంగా ఎమ్మెల్యేగా మంత్రిగా పని చేసిన ముద్దసాని దామోదర్ రెడ్డి పేద ప్రజల పక్షపాతి అని మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వం పల్లి సత్యనారాయణ అన్నారు. ముద్దసానిది మా పక్క ఊరే కావడంతో ఆయన వద్దకు ఏ పనికి వెళ్లినా కూడా కాదనకుండా చేశారని గుర్తు చేశారు.ఆయన ఫోను తీశాడు అంటే ఆ పని కచ్చితంగా కావాల్సిందేనని అన్నారు.ఆయనను నమ్ముకున్న పార్టీ కార్యకర్తలు, ప్రజలకు ఎంతో సేవ చేశాడని గుర్తు చేశారు.దేవాలయాల్లోకి దళితులను రానివ్వ లేని రోజుల్లో ఇల్లందకుంట దేవస్థానానికి దళితుడిని చైర్మన్ చేసిన ఘనత దామోదర్ రెడ్డి కే దక్కుతుందని అన్నారు.తన కుటుంబ సభ్యులు వ్యతిరేకించినా కూడా ఒక దళితురాలిని ప్రేమించి పెళ్లి చేసుకున్నారని అన్నారు. దామోదర్ రెడ్డి విగ్రహాన్ని దామోదర్ రెడ్డి నాయకత్వం ఎంతోమందికి రోల్ మోడల్ గా నిలిచిందని,ఆయన నాయకత్వంలో పలువురు ఎమ్మెల్యేలుగా,ప్రజా ప్రతినిధులుగా ఎన్నికయ్యారని అన్నారు. దామన్న అడుగుజాడల్లో నడుస్తున్న ప్రభుత్వ విప్ విజయ రమణారావు ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు చేసిన కృషి మరువలేనిదన్నారు. ఆయన ఆశయ సాధన కోసం పాటుపడతామని సత్యనారాయణ స్పష్టం చేశారు. కరీంనగర్ జిల్లాను శాసించిన ఏకైక నాయకుడు దామోదర్ రెడ్డి అని,ఆ నాయకుని వర్ధంతిని మనం జరుపు కోవడం సంతోషకరమన్నారు. ముద్దసానికి కృతజ్ఞతగా సదాశివపల్లిలో విగ్రహాన్ని నెలకొల్పామని కవ్వం పల్లి వివరించారు.

సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ దామోదర్ రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేసిన కూడలిని మంచి ఐలాండ్ గా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా పలువురు నాటి టీడీపీ నాయకులు దామోదర్ రెడ్డితో గడిపిన జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.కొందరు ఉద్వాగానికి లోనయ్యారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం మాట్లాడుతూ ముద్దసాని దామోదర్ రెడ్డి ఎమ్మెల్యేగా మంత్రిగా ప్రజలకు చేసిన సేవలు,ఆయన అనుసరించిన విధానాలు రాజకీయ నాయకులకు స్ఫూర్తిదాయకమన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని యువకులు రాజకీయాల్లోకి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ మేయర్ కె శ్రీనివాస్,పెద్దపల్లి గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య, రామగుండం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పాతుపల్లి ఎల్లయ్య,హుజురాబాద్ నియోజకవర్గం ఇన్చార్జి వొడితెల ప్రణవ్ బాబు, దామోదర్ రెడ్డి కుటుంబ సభ్యులు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ముద్దసాని పురుషోత్తం రెడ్డి, మధుసూదన్ రెడ్డి,వివిధ పార్టీల నాయకులు కొత్తూరి జగన్ గౌడ్,వాసాల రమేష్, డాక్టర్ పి.రవీందర్ రావు,కర్రు నాగయ్య,మాదాడి శ్రీనివాస్ రెడ్డి,బత్తిని శ్రీనివాస్ గౌడ్, తగ్గు దామోదర్,ఆకుల నరసయ్య,మినుపాల ప్రకాష్ రావు,అక్కపాక తిరుపతి, కొత్త తిరుపతిరెడ్డి,కందుల ఆది రెడ్డి,చందా గాంధీ,బత్తిని శ్రీనివాస్ గౌడ్,ఊకంటి మధుకర్,పడాల అజయ్, పొనగంటి మల్లయ్య, కట్టంగూరి శ్రీకాంత్ రెడ్డి, రామస్వామి,రఘు, కార్పొరేటర్ నందిని,బండారి రమేష్,గోపు మల్లారెడ్డి,రవి యాదవ్,కంది అశోక రెడ్డి, కంది లక్ష్మీనారాయణ రెడ్డి,మోరపల్లి రమణారెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాసరావు, శ్రీగిరి రంగారావు,చింతల లక్ష్మారెడ్డి,నోముల అనిల్, రవీంద్ర చారి,తాళ్లపల్లి సంపత్ గౌడ్ జావా శ్రీనివాసరెడ్డి, ముసుకు ఉపేందర్ రెడ్డి,గోపగోని బసవాగౌడ్,ముఖ్యసా రత్నాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యత ప్రమాణాలతో కూడిన విద్యను నేర్పించాలి

**జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్**



జగిత్యాల (తెలంగాణ వాణి ప్రతినిధి): ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కుమ్మరిపల్లి గ్రామంలోని తెలంగాణ మోడల్ స్కూల్ పాఠశాలను జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మాడల్ స్కూల్ పాఠశాలలోని విద్యార్థులకు నాణ్యతా ప్రమాణాలతో కూడిన విద్యను నేర్పించాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ పేర్కొన్నారు.వెల్గటూర్ మండలం కుమ్మరిపల్లి తెలంగాణ మోడల్ స్కూల్ పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాలను మొత్తం సందర్శించి విద్యార్థుల స్థితిగతులను, వారికి కల్పిస్తున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా విద్యా ప్రమాణాలు, మౌళిక సదుపాయాల తీరును కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వ తెలంగాణ మోడల్ స్కూల్ చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. క్లాస్ రూమ్ లో ఎంతమంది విద్యార్థులు ఉన్నారు అని కలెక్టర్ ఆరా తీశారు. అదే విధంగా ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తున్నారా లేదా అని కలెక్టర్ హాజరు పట్టికను పరిశీలించారు. పాఠశాలలోని ప్రతీ విద్యార్థి పై ప్రత్యేక దృష్టి సారించాలని, సర్కారు బడుల్లో క్వాలిఫైడ్ ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని, భావి తరాలకు అవసరమైన విద్యా బోధన చేయడం జరుగుతున్నదని తెలిపారు. వెనుక బడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి వంద శాతం ప్రగతి సాధించే విధంగా విద్యా బోధనకు కృషి చేయాలని అన్నారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు, తరగతుల నిర్వహణ, పరిసరాల పారిశుద్ధ్య సౌకర్యాలు వంటి అంశాలను పరిశీలించారు.. విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందుతున్నదా అనే విషయాన్ని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని, భోజన తయారీ విషయంలో నాణ్యతా ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. పాఠశాల తరగతి గదులలో పరిసరాల పరిశుభ్రతను పాటించాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. తెలంగాణ మోడల్ స్కూల్ పాఠశాల ఆవరణంలో పిచ్చి మొక్కలు తొలగించి, శానిటేషన్ చేయించాలని సూచించారు. పాఠశాల ఆవరణలో ఇంకుడు గుంతలను, కిచెన్ షేడ్ లను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు.ముఖ్యంగా పాఠశాల ఉపాధ్యాయులు సమయపాలన తప్పకుండా పాటించాలని చెప్పడం జరిగింది.ఈ తనిఖీలో భాగంగా జిల్లా విద్యాశాఖ అధికారి కె.రాము, డిఆర్డిఓ పీడీ రఘువరన్, ఎమ్మార్వో , ఎంపిడిఓ, గ్రామ సర్పంచులు, స్థానిక ప్రజా ప్రతినిధులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రామవరం ప్రాంతానికి యుద్ధ ప్రాతిపదికన మంచి నీళ్లు అందించాలి

**మిషన్ భగీరథ పట్ల అధికారులు అలసత్వాన్ని వీడాలి**

**భగీరథ పనులను పరిశీలించిన సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె షాబీర్ పాష , ప్రతినిధి బృందం**



భద్రాద్రి కొత్తగూడెం (తెలంగాణ వాణి): కార్పొరేషన్ పరిధిలోని రామవరం ప్రాంతంలో ఉన్న నీటి ఎద్దడి నివారించేందుకు చర్యలు తీసుకొని యుద్ధ ప్రాతిపదికన మంచినీళ్లు అందించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి షాబీర్ పాషా అధికారులకు పిలుపునిచ్చారు. గురువారం ఉదయం రామవరం లోని కిన్నెరసాని ,భగీరథ పనుల పైప్ లైన్లను, నూతన ట్యాంకులను పరిశీలించి ఆయన మాట్లాడుతూ స్థానిక శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు 125 కోట్లతో మిషన్ భగీరథ పథకాన్ని మంజూరు చేయించి ప్రజలు మంచినీళ్లకు బాధపడొద్దని కృతనిశ్చయంతో చేసిన పనులకు అధికారుల అలసత్వం ద్వారా పనులు జాప్యం అవుతున్నాయని అన్నారు. తక్షణమే మిషన్ భగీరథ పనులను పూర్తి చేసి నూతన ట్యాంక్ కి నీళ్లు ఎక్కించి రామవరం లో నీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధికారులకు ఫోన్లో ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. అలాగే పాత కిన్నెరసాని ట్యాంక్ ద్వారా సాయంత్రానికి నీళ్లు అందించాలని అధికారులకు ఆదేశించినట్లు ఆయన తెలిపారు. అలాగే స్టాండ్ బై మోటార్లను ఏర్పాటు చేసుకొని మంచినీటి సరఫరా లో అవాంతరాలు ఏర్పడకుండా చూసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు .అలాగే పైప్ లైన్ జరుగుతున్న ప్రాంతాల్లో శిథిలమైన రోడ్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అసౌకర్యం లేకుండా చూడాలని మిషన్ భగీరథ అధికారులను ఆయన ఆదేశించారు పనులను పరిశీలించిన సిపిఐ ప్రతినిధి బృందంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మునిగడప వెంకటేశ్వర్లు, జిల్లా కౌన్సిల్ సభ్యులు భూక్య శ్రీనివాస్, రామవరం బ్రాంచ్ కార్యదర్శి మర్రి గోపి, త్రీ టౌన్ టౌన్ ఏరియా కార్యదర్శి యూసుఫ్, 14,16,17 వ డివిజన్ కార్పొరేటర్స్ సుధాకర్ రాజు, మునిగడప పద్మ, ఎర్రబెల్లి శంకర్, సీనియర్ నాయకులు మాటేటి గోపాల్, సర్పంచ్ నగేష్, రమేష్, అంకుష్ గంటాడి కోటేశ్వరరావు, ఖంపెల్లి దుర్గయ్య, నాగరాజు, శివ,రాజు ,జగ్గు, చందు, నాగరాజులు పాల్గొన్నారు.

# పెద్దితో ఆటపాట?



ఇటీవల వచ్చిన 'కపుల్ ఫ్రెండ్లీ' చిత్రంలో చక్కటి అభినయంతో ప్రేక్షకుల్ని మెప్పించింది హైదరాబాదీ సొగసరి మానస వారణాసి. ప్రస్తుతం ఈ భామకు టాలీవుడ్‌లో మంచి ఆఫర్లొస్తున్నట్లు తెలిసింది. ఇదిలావుండగా రామ్‌చరణ్ 'పెద్ది' చిత్రంలో ఈఅమ్మడు ఓ ఐటెంసాంగ్‌లో నర్తించనుందని వార్తలు వినిపిస్తున్నాయి. తొలుత ఈ ప్రత్యేకగీతం కోసం మృణాల్ ఠాకూర్‌ను సంప్రదించారని, డేట్స్‌లేని కారణంగా ఆమె తిరస్కరించిందని సమాచారం. ఈ నేపథ్యంలో ఈ స్పెషల్‌సాంగ్ కోసం చిత్రబృందం యంగ్ హీరోయిన్‌ను ఎంపిక చేసే ప్రయత్నాల్లో ఉందట. ఇప్పటికే మానస వారణాసితో సంప్రదింపులు పూర్తయ్యాయని అంటున్నారు. అయితే ఈ వార్తలో నిజానిజాలెంతో తెలియాలంటే మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న 'పెద్ది' చిత్రం ఒక్కపాట మినహా షూటింగ్‌ను పూర్తిచేసుకుంది. ఈ నెల 30న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది.

# రాకాలో ద్విపాత్రాభినయం మలుపు?

## అల్లు అర్జున్ రూపం వెనుక భారీ రహస్యం!





అల్లు అర్జున్ నటిస్తున్న 'రాకా' చిత్రం ప్రస్తుతం సినీ రంగంలో సంచలనంగా మారింది. దర్శకుడు అట్లీ రూపొందిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ విడుదల కావడంతోనే భారీ చర్చ మొదలైంది. విడుదలైన ఫస్ట్ లుక్‌లో అల్లు అర్జున్ పూర్తిగా కొత్తగా కనిపించారు. ముందు గుండు, వెనుక కొద్దిగా జుట్టుతో, ముఖాన్ని చేతులతో కప్పుకున్న తీరు భయానకంగా, రహస్యంగా ఉంది. సగం మనిషి, సగం తోడేలు స్వరూపంలో కనిపించనున్నట్టు ఈ చిత్రం సూచిస్తోంది. ఈ చిత్రంలో దీపిక పదుకొణే ప్రధాన కథానాయికగా నటిస్తోంది. ఆమె పాత్ర యోధురాలిగా ఉంటుందని సమాచారం. మరోవైపు రమ్యకృష్ణన్ కూడా కీలక పాత్రలో కనిపించనుందనే వార్తలు వినిపిస్తున్నాయి. అల్లు అర్జున్ ఫస్ట్ లుక్‌పై స్పందించిన రమ్యకృష్ణ.. "పరిధులను దాటి వెళ్లే అనుభవానికి సిద్ధంగా ఉండండి" అని చెప్పడం ఆమె పాత్రపై మరింత ఆసక్తిని పెంచింది. ఈ చిత్రంలో అల్లు అర్జున్ రెండు పాత్రల్లో కనిపించనున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ఒకటి నాయక పాత్ర కాగా, మరొకటి ప్రతినాయక స్వభావం కలిగిన పాత్రగా ఉంటుందని సమాచారం. ప్రస్తుతం విడుదలైన రూపం ప్రతినాయక పాత్రదేనని చెబుతున్నారు. ఈ చిత్రంలో ఒకరి కంటే ఎక్కువ కథానాయికలు ఉండొచ్చని ప్రచారం జరుగుతోంది. సమంత రూత్ ప్రభు, రష్మిక మంధాన పేర్లు వినిపిస్తున్నప్పటికీ దీనిపై ఇంకా అధికారిక ప్రకటన లేదు. ఇక 'రాకా' అనే పదానికి రాక్షసుడు, పౌర్ణమి చంద్రుడు వంటి అర్థాలున్నాయి. ఈ చిత్రంలో నాయకుడి లోపల ఉన్న చీకటి, విధ్వంసక శక్తిని చూపించేలా ఈ పేరును ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఈ చిత్రాన్ని అత్యంత భారీ వ్యయంతో నిర్మిస్తున్నారు. విజ్ఞానకథాంశం, అసాధారణ శక్తుల నేపథ్యంతో ఈ చిత్రం రూపొందుతున్నట్లు సమాచారం. వచ్చే ఏడాది వేసవిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని యోచిస్తున్నారు.

# ఘనంగా అల్లు అరవింద్ పెళ్లిరోజు వేడుకలు



టాలీవుడ్ ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ కుటుంబంలో ఆనంద వాతావరణం నెలకొంది. అల్లు అరవింద్ – నిర్మల దంపతుల 52వ వివాహ వార్షికోత్సవాన్ని కుటుంబ సభ్యులు ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకలను ఇంట్లోనే గ్రాండ్‌గా నిర్వహించడం విశేషం. ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని ఇటీవల వివాహం చేసుకున్న అల్లు శిరీష్ – నయనిక రెడ్డి జంట దగ్గరుండి నిర్వహించారు. కుటుంబ సభ్యులందరినీ ఒకేచోట చేర్చి, ఈ వేడుకను మరింత ప్రత్యేకంగా మార్చారు. ఈ సందర్భంగా అల్లు కుటుంబ సభ్యులందరూ కలిసి ఫోటోలు దిగారు. ఆ ఫోటోల్లో అల్లు అరవింద్, ఆయన భార్య నిర్మలతో పాటుపెద్ద కొడుకు అల్లు బాబీ – కోడలు నీలు షా, రెండో కొడుకు అల్లు అర్జున్ – కోడలు స్నేహారెడ్డి, మూడో కొడుకు అల్లు శిరీష్ – కోడలు నయనిక రెడ్డి ఉన్నారు. చాలా రోజుల తర్వాత అందరూ కలిసి కనిపించడంతో ఈ ఫ్యామిలీ ఫోటో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ వేడుకకు సంబంధించిన ఫోటోలు ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా ముగ్గురు కొడుకులు, కోడళ్లతో కలిసి ఉన్న అల్లు అరవింద్ ఫ్యామిలీ ఫోటోను అభిమానులు భారీగా షేర్ చేస్తున్నారు. అల్లు కుటుంబం మొత్తం ఒకే ఫ్రేమ్‌లో కనిపించడం అభిమానులకు ఆనందాన్ని కలిగిస్తోంది. అల్లు అరవింద్ పెళ్లిరోజు వేడుకలు కుటుంబ సమేతంగా జరగడం, ఆ ఫోటోలు వైరల్ కావడం అభిమానుల్లో ఆనందాన్ని నింపాయి. అల్లు ఫ్యామిలీ బాండింగ్ మరోసారి అందరినీ ఆకట్టుకుంది. ఇక అల్లు అర్జున్ ప్రస్తుతం పాన్ ఇండియా హీరోగా మంచి క్రేజ్ తెచ్చుకున్నాడు. ఆయన నటిస్తున్న తాజా చిత్రం రాగా, ఈ మూవీపై అంచనాలు బారీగా ఉన్నాయి. బన్నీ బర్త్ డే సందర్భంగా విడుదలైన ఫస్ట్ లుక్ సినిమాపై అంచనాలు పెంచింది. ఈ చిత్రం అట్లీ దర్శకత్వంలో భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాని 2027లో విడుదల చేయనున్నారు. మూవీపై భారీ అంచనాలు ఉండగా, ఈ సినిమా అనేక రికార్డులు తిరగరాయడం ఖాయం అంటున్నారు.

# సినిమా

## నా జీవితంలో ఒక బ్రేకప్ ఉంది: కృతి శెట్టి



'ఉప్పెన' బ్యూటీ కృతి శెట్టి, 'లవ్ టుడే' ఫేమ్ ప్రదీప్ రంగనాథన్ జంటగా నటించిన 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' (L.I.K) సినిమా విడుదలకు సిద్ధమైంది. విఘ్నేశ్ శివన్ దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 10న థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా జరిగిన ప్రమోషన్లలో ఈ ఇద్దరు సెలబ్రిటీలు తమ బ్రేకప్స్ గురించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా మారాయి. కృతి శెట్టి మాట్లాడుతూ... తనకు గతంలో ఒకసారి బ్రేకప్ జరిగిందని వెల్లడించింది. ఈ విషయం తన తల్లికి కూడా తెలుసని, ప్రస్తుతం మాత్రం తాను సింగిల్‌గా ఉన్నానని స్పష్టం చేసింది. అలాగే సోషల్ మీడియాలో తనపై నెగిటివిటీ ప్రచారం చేసే వారిని ఏమాత్రం ఆలోచించకుండా వెంటనే బ్లాక్ చేస్తానని ఆమె క్లారిటీ ఇచ్చింది. ప్రదీప్ రంగనాథన్ మాట్లాడుతూ... తన లైఫ్ లో ఒకటి కాదు, చాలా బ్రేకప్స్ జరిగాయని నవ్వుతూ చెప్పాడు. అవతలి వాళ్లే తనను బ్లాక్ చేశారని నిజాయతీగా ఒప్పుకున్నాడు. కాలేజీ రోజుల్లో అమ్మాయిల మెసేజ్‌లకు తాను చాట్ జీపీటీ కంటే వేగంగా రిప్లై ఇచ్చేవాడినని, అంతలా కష్టపడినా చివరకు సింగిల్‌గానే మిగిలిపోయానని సరదాగా వ్యాఖ్యానించాడు.

## రేణు దేశాయ్‌పై అసభ్యకర కామెంట్.. గుంటూరు వ్యక్తి అరెస్ట్



నటి రేణు దేశాయ్ సోషల్ మీడియా రీల్‌పై అసభ్యకరమైన, అభ్యంతరకరమైన వ్యాఖ్య పోస్ట్ చేసినందుకు ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరుకు చెందిన ఓ వ్యక్తిని సైబరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. సోషల్ మీడియాలో తనపై జరుగుతున్న వేధింపులపై రేణు దేశాయ్ ఇటీవల చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ చర్యలు తీసుకున్నారు. చెన్నయ్య రుంజాల అనే వ్యక్తి తన యూట్యూబ్ ఖాతా నుంచి రేణు దేశాయ్ రీల్‌ను చూసి, దానిపై అనుచిత వ్యాఖ్య చేసినట్లు సైబర్ క్రైమ్ పోలీసులు తమ దర్యాప్తులో గుర్తించారు. నిందితుడు గుంటూరులో ఉన్నట్లు తెలుసుకుని, అక్కడికి వెళ్లి అతడిని అదుపులోకి తీసుకుని గచ్చిబౌలిలోని సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విచారణలో నిందితుడు తన ఫోన్ నుంచే ఆ కామెంట్ పెట్టినట్లు అంగీకరించాడు. ఆన్‌లైన్‌లో తనపై అసభ్యకరంగా మాట్లాడుతున్న వారిపై, తన వ్యక్తిగత జీవితంలోకి చొరబడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని రేణు దేశాయ్ ఈ నెల ప్రారంభంలో సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో విడాకులైనప్పటి నుంచి తాను వేధింపులు ఎదుర్కొంటున్నానని ఆమె గతంలో తెలిపారు. ఈ నేపథ్యంలో సోషల్ మీడియా వినియోగదారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అసభ్యకరమైన, పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలు చేయవద్దని అధికారులు హెచ్చరించారు. అభ్యంతరకరమైన కంటెంట్ పోస్ట్ చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సైబర్ నేరాల గురించి 1930 హెల్ప్‌లైన్‌కు లేదా సమీప సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

## వదినపై రూ.2 కోట్ల పరువునష్టం దావా వేసిన నటి హన్సిక



ప్రముఖ సినీ నటి హన్సిక మోత్వాని, తన వదిన, టీవీ నటి ముస్కాన్ నాన్సీ జేమ్స్‌పై రూ.2 కోట్ల పరువునష్టం దావా వేశారు. తనపై, తన సోదరుడు ప్రశాంత్ మోత్వానిపై ముస్కాన్ గృహ హింస ఆరోపణలు చేయడంతో తన ప్రతిష్ఠకు భంగం కలిగిందని ఆరోపిస్తూ హన్సిక ముంబై సెషన్స్ కోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు ఆమె తరఫున న్యాయవాది అద్నాన్ షేక్ పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్ ప్రకారం తన సోదరుడు ప్రశాంత్‌తో వివాహ సమయంలో ముస్కాన్ రూ.27 లక్షలు అప్పుగా తీసుకున్నారని, దాన్ని తిరిగి చెల్లించకుండా తప్పించుకోవడానికే సోషల్ మీడియాలో తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని హన్సిక పేర్కొన్నారు. తన సోదరుడి వైవాహిక జీవితంతో తనకు పరిమిత ప్రమేయం మాత్రమే ఉందని, వారు నివసించే ఇంట్లో తాను లేనని స్పష్టం చేశారు.గతంలో ముస్కాన్.. తన భర్త ప్రశాంత్‌తో పాటు హన్సికపై కూడా వేధింపులు, గృహ హింస ఆరోపణలతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివాహ సమయంలో ఖరీదైన బహుమతులు డిమాండ్ చేశారని, వారి వేధింపుల వల్లే తనకు బెల్స్ పాల్సీ (ముఖ పక్షవాతం) వచ్చిందని ఆమె ఎఫ్ఐఆర్‌లో ఆరోపించారు. ఈ ఆరోపణలను హన్సిక పూర్తిగా ఖండించారు. ఈ ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ ఆమె గతంలో బాంబే హైకోర్టును ఆశ్రయించారు.తాజా పరువునష్టం దావాలో భాగంగా ముస్కాన్ తనకు బహిరంగ క్షమాపణ చెప్పాలని, భవిష్యత్తులో ఎలాంటి ఆరోపణలు చేయకుండా ఆమెను నిలువరించాలని కోర్టును హన్సిక కోరారు. సివిల్ దావాతో పాటు, భారతీయ న్యాయ సంహిత కింద అంధేరిలోని మెజిస్ట్రేట్ కోర్టులో క్రిమినల్ పరువునష్టం కేసు కూడా దాఖలు చేశారు. ప్రశాంత్, ముస్కాన్ 2020లో వివాహం చేసుకోగా, 2022 నుంచి విడిగా ఉంటున్నారు. దిండోషి సెషన్స్ కోర్టులో ఈ పరువునష్టం దావా త్వరలో విచారణకు రానుంది.

## రబీ ధాన్యం కొనుగోలుకు..

# పక్కా కార్యాచరణ సిద్ధం



### జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి (తెలంగాణ వాణి) : జిల్లాలో రబీ ధాన్యం కొనుగోలుకు పక్కా కార్యాచరణ సిద్ధం చేసి, లక్ష్యాలను సమయానికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో రబీ ధాన్యం కొనుగోలుపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్ డి వేణుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ జిల్లాలో సుమారు 4.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ధారించామని, ఏప్రిల్ లో కొనుగోలు ప్రారంభించి మే నెలాఖరు నాటికి పూర్తి చేయాలని సూచించారు. తేమ శాతం వచ్చిన వెంటనే 24 గంటల్లో ధాన్యం కొనుగోలు పూర్తి చేసి కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలని ఆదేశించారు. కొన్ని కొనుగోలు కేంద్రాలు కేటాయించని మిల్లర్లకు ధాన్యం పంపిస్తున్నట్లు గమనించామని, యాసంగి సీజన్‌లో ఇది పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఆకస్మిక వర్షాల నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్ కవర్లు సిద్ధంగా ఉంచాలని, అవసరమైన హమాలి కార్మికులను సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో హమాలి ఏర్పాట్లు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. తేమ ధాన్యాన్ని ముందుగా ఎత్తివేయాలని, ఎటువంటి వివక్ష లేకుండా కొనుగోలు జరగాలని స్పష్టం చేశారు. రామగిరి గ్రామ సభలో చిన్న రైతుల ధాన్యం ముందుగా కొనుగోలు చేయలేదని వచ్చిన ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకొని, ఈసారి అలాంటి పరిస్థితి రాకుండా చిన్న రైతులకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. నాణ్యమైన ధాన్యాన్ని 24 గంటలలోపు కేటాయించిన మిల్లులకు తరలించాలని, కొనుగోలు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. యాసంగి ధాన్యం కొనుగోలుకు అవసరమైన గన్ని సంచుల సరఫరాపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, ఎటువంటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ట్యాబ్‌ల ద్వారా 24 గంటల్లో 100శాతం ఆన్‌లైన్ నమోదు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రవీందర్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీనాథ్, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, జిల్లా సహకార అధికారి శ్రీ మాల, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉక్కపోతలో ఈటెల



హైదరాబాద్, ఏప్రిల్ 9,: భారతీయ జనతా పార్టీలో మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ ఉక్కపోతకు గురవుతున్నారా? పార్టీ మారుతానని సోషల్ మీడియాలో సొంత పార్టీ నేతలే దుష్ప్రచారం చేస్తున్నారని, వివిధ రకాలుగా ఇబ్బందులు సృష్టిస్తున్నారని ఆయన భావిస్తున్నారా? అంటే తాజాగా చేసిన వ్యాఖ్యలు అవుననే అంటున్నాయి. దుష్ప్రచారంపై సొంత పార్టీ నాయకులపై పరోక్షంగా అప్పుడప్పుడు ఆక్రోషం సైతం వెళ్లగకుతున్నారు. ఈటెల రాజేందర్ మళ్లీ బి ఆర్ ఎస్ లో చేరుతున్నారని ఇటీవల సోషల్ మీడియాలో బాగా ప్రచారం జరుగుతోంది. ఇలా ప్రచారం జరగడం కొత్త కాదు. గతంలోనూ ఇలాంటి ప్రచారం జరగగా రాజేందర్ ఖండించారు. తాజాగా మళ్లీ పూడూరు శివారులో ని నివాసంలో దుష్ప్రచారాన్ని ఖండించారు. కెసిఆర్ తనను భర్తరఫ్ చేశారని, ఆర్థికంగా అనేక ఇబ్బందులు పెట్టారని, అప్పటి ఇబ్బందులు తలుచుకుంటేనే బాధ అనిపిస్తుందని, ఎన్నో సమస్యలు ఎదుర్కొని మళ్లీ బి ఆర్ ఎస్ లో ఎలా చేరుతానని ఈటల రాజేందర్ ప్రశ్నించారు. ఈ ప్రచారం వెనుక సొంత పార్టీ నాయకుల హస్తముందని ఆయన భావిస్తున్నారు. గతంలో ప్రచారం జరిగినప్పుడు కూడా సొంత పార్టీ నాయకులపై నిప్పులు చెరిగారు. జూలై 19న హుజురాబాద్ నుంచి పార్టీ కార్యకర్తలు పూడూరులోని ఆయన ఇంటికి వచ్చిన సమయంలో ఘాటు వ్యాఖ్యలు చేశారు.' ఒక సైకో, శాడిస్టు, వాడు మనిషా, ఏ పార్టీలో ఉన్నాడు, కొడుకా బి కేర్ఫుల్'అని మండిపడ్డారు. ఎవరు సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారు అధిష్టానానికి ఫిర్యాదు చేస్తానని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో ఈటెల రాజేందర్ సొంత నియోజకవర్గంలో హుజురాబాద్ వెళ్ళవద్దని బిజెపి నాయకులు ఆంక్షలు విధించారు. 20 ఏళ్లు ఆ నియోజకవర్గంలో ప్రాతినిధ్యం వహించారు. ఆయనకు పెద్ద సంఖ్యలో అనుచర గణం ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఈటెల రాజేందర్ అక్కడే పోటీ చేశారు. ఆ నియోజకవర్గంలో ప్రభావితం చేయగల నాయకుడు. అయినప్పటికీ హుజురాబాద్ వెళ్ళవద్దని పార్టీ పెద్దలు సూచించడం విస్మయానికి గురిచేస్తుంది. ఎన్నికల సమయంలో నాయకులందరినీ ప్రచారానికి పిలిచి పార్టీ అ భ్యర్థుల విజయానికి చర్యలు తీసుకుంటారు. ఏ ఒక్క అవకాశాన్ని వదులుకోరు. కానీ ఈటెల రాజేందర్ ను హుజురాబాద్ రావద్దు అని చెప్పడం అంతర్గత పోరుకు అద్దం పడుతోంది. అంతర్గత వర్గ పోరులో బీజేపీ అభ్యర్థులు బలయ్యారు. ఈటల రాజేందర్ కు ఢిల్లీ పెద్దలతో సత్సంబంధాలు ఉన్నాయి. వివిధ సందర్భాలలో కేంద్ర మంత్రులను, అమిత్ షా, ప్రధాని నరేంద్ర మోడీ లను కలుస్తుంటారు. కానీ రాష్ట్ర నాయకులతో విభేదాలు ఉన్నాయి. పదవులు రాకుండా రాష్ట్ర నాయకులు అడ్డుకుంటున్నారని రాజేందర్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. సొంత పార్లమెంటు నియోజకవర్గం మల్కాజిగిరి లోను తన ప్రభావాన్ని తగ్గించడానికి ప్రయత్నిస్తున్నట్లు ఈటెల రాజేందర్ అనుమానిస్తున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సమయంలో ఇతర నాయకులు వేలు పెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని భావించి గెలిచేవారికి టికెట్లు అని ప్రకటించారు. అంతేగాక ఈ నియోజకవర్గంలో తనకున్నంత అవగాహన ఇంకొకరికి ఉండదని స్పష్టం చేశారు.

# టీఎన్జీవోస్ రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా సర్దార్ హర్మిందర్ సింగ్ నియామకం



కరీంనగర్:ఏప్రిల్ 09 (తెలంగాణ వాణి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల హక్కుల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న టీఎన్జీవోస్ యూనియన్‌లో కీలక పద విగా భావించే రాష్ట్ర ప్రచార కార్యదర్శి పదవికి కరీంనగర్ నగరానికి చెందిన ప్రముఖ ఉద్యోగుల సంఘం నాయ కుడు సర్దార్ హర్మిందర్ సింగ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఇటీవల హైదరాబాద్ లోని నాంపల్లి టీఎన్జీవోస్ భవన్‌లో నిర్వహించిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఏకగ్రీవం గా ఈ నిర్ణయం తీసుకున్నారు. సంఘ కార్యకలాపాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ, ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ముందుండే నాయకుడిగా పేరుగాంచిన సర్దార్ హర్మిందర్ సింగ్ గత కొంతకాలంగా యూనియన్‌కు చేసిన విశేష సేవలను గుర్తించి ఈ బాధ్యతలను అప్పగించిన ట్లు రాష్ట్ర నాయకత్వం వెల్లడించింది. తెలంగాణ ఉద్యమంలో ముఖ్యంగా ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, సంక్షేమ కార్యక్రమాల అమలు లో ఆయన చేసిన కృషి ప్రశం సనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సర్దార్ హర్మిందర్ సింగ్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమం, ఉద్యోగుల సంక్షే మం వరకు ప్రతి దశలో టీఎన్జీవోస్ యూనియన్ పోషించిన పాత్ర చారిత్రాత్మ కమని అన్నారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో, వారికి న్యా యం చేయించడంలో యూని యన్ ఎల్లప్పుడూ ముందుంటుందని అన్నారు. తాను కూడా రాష్ట్ర ప్రచార కార్యద ర్శిగా బాధ్యతలు నిర్వహిస్తూ యూనియన్ లక్ష్యాలను మరింత విస్తృతంగా ప్రజలకు, ఉద్యోగులకు చేరవేయడానికి కృషి చేస్తానని తెలిపారు. తనను ఈ కీలక బాధ్యతకు ఎంపిక చేసినందుకు యూని యన్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్, అలాగే రాష్ట్ర మరియు జిల్లా కమిటీ నాయకులందరికీ ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ నియామకం తనపై మరింత బాధ్యతను ఉంచింద ని, అందుకు తగిన విధంగా నిబద్ధతతో పనిచేస్తానని అన్నారు. ఇదిలా ఉండగా, సర్దార్ హర్మిందర్ సింగ్ నియామకంపై వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కోట రామస్వామి, కార్యదర్శి వడ్డకొండ శంకరయ్యలు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన నాయక త్వంలో ఉద్యోగుల సమస్య లు మరింత వేగంగా పరిష్కా రం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో సర్దార్ హర్మిందర్ సింగ్ మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి ఉద్యోగుల సంక్షేమానికి మరింత సేవలు అందించా లని కోరుకుంటున్నట్టు వారు తెలిపారు. ఈ నియామకం యూనియన్ కార్యకలాపా లకు కొత్త ఊపునిస్తుందని, రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగుల ఐక్యతను మరింత బలోపేతం చేస్తుందని సంఘ నాయకులు పేర్కొన్నారు.

### కరీంనగర్ వ్యక్తికి న్యూరో ఎండోస్కోపీతో కొత్త జీవితం అందించిన..

# మెడికవర్ హాస్పిటల్స్ హైదరాబాద్ వైద్యులు

**మెదడు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిన డాక్టర్ రమేష్ శిఘాకొల్లి**

**10 సార్లు సర్జరీలు విఫలమైనా పట్టు వదలని వైద్య బృందం**



కరీంనగర్ (తెలంగాణ వాణి): ఏళ్ల తరబడి మెదడు సమస్యతో బాధపడుతూ, పదే పదే శస్త్రచికిత్సలు చేయించుకున్నా ఉపశమనం పొందలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న కరీంనగర్‌కు చెందిన ఒక మధ్యవయస్కుడికి అత్యాధునిక న్యూరో ఎండో స్కోపిక్ చికిత్స ద్వారా కొత్త జీవితం లభించింది. దాదాపు 10 సార్లు శస్త్రచికిత్సలు విఫలమైన తర్వాత కూడా పట్టువదలని వైద్యులు, మెదడులోని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం విశేషం. కరీంనగర్ జిల్లాకు చెందిన ఈ వ్యక్తి కొంత కాలంగా తీవ్రమైన తలనొప్పి, అతిగా నిద్రపోవడం, రోజు వారీ పనులు చేసుకోలేకపోవడం, అలసట, అసహనం వంటి సమస్యలతో బాధపడు తున్నారు. పలు ఆసుపత్రుల్లో పరీక్షలు చేయించగా, ఆయన కు హైడ్రోసెఫాలస్ అనే మెదడు సంబంధిత సమస్య ఉన్నట్లు నిర్ధారించారు. మెదడులో సెరెబ్రో స్పైనల్ ఫ్లూయిడ్ (జూఖీ) అధికంగా పేరుకుపోయి, మెదడుపై ఒత్తిడి పెరగడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడుతుంది. ఈ సమస్యను నియంత్రించ డానికి గతంలో రోగికి అనేక సార్లు షంట్ సర్జరీలు నిర్వహించారు. సాధారణంగా షంట్ ద్వారా మెదడులో పేరుకుపోయిన ద్రవాన్ని శరీరంలోని ఇతర భాగాలకు మళ్లిస్తారు. అయితే ఈ రోగి విషయంలో షంట్ పదే పదే బ్లాక్ అవడం, ఇన్ఫెక్షన్లు రావడం, మళ్లీ మళ్లీ సర్జరీలు అవసరం కావడం వల్ల పరిస్థి తి మరింత క్లిష్టంగా మారింది. పదే పదే ఆపరేషన్లు చేయిం చుకోవడంతో రోగి మరియు కుటుంబ సభ్యులు తీవ్ర మానసిక, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చివరి ప్రయ త్నంగా వారు ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ రమేష్ శిఘా కొల్లిని సంప్రదించారు. రోగి పూర్తి వైద్య చరిత్ర, పాత శస్త్రచికిత్సల వివరాలు, స్కానింగ్ రిపోర్టులను పరిశీలించిన అనంతరం డాక్టర్ రమేష్ బృందం అత్యాధునిక న్యూరో ఎండోస్కోపీ విధానాన్ని ఉపయోగించి శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించింది. ఈ విధానంలో ఎటువంటి బయటి ట్యూబులు లేదా షంట్లు ఉపయోగించకుండా, మెదడులో పేరుకుపోయిన ద్రవం సహజంగా ప్రవహించే లా ఒక కొత్త మార్గాన్ని సృష్టిం చారు. చిన్న రంధ్రం ద్వారా ఎండోస్కోప్ సహాయంతో నిర్వహించే ఈ మినిమల్లీ ఇన్వాసివ్ సర్జరీ అత్యంత క్లిష్టమైనదైనా, వైద్యులు విజయవంతంగా పూర్తి చేశారు. శస్త్రచికిత్స అనంతరం రోగి ఆరోగ్యం గణనీయంగా మెరుగుపడింది. గత నాలుగు నెలలుగా ఎటువంటి సమస్య లు లేకుండా ఆయన సాధా రణ జీవితం గడుపుతు న్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ శిఘాకొల్లి మాట్లాడుతూ, "హైడ్రోసెఫాలస్ వంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకూడదు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అవగా హన లేకపోవడం వల్ల రోగులు ఆలస్యంగా వస్తుంటారు. చాలామంది షంట్ సర్జరీలపై నే ఆధారపడుతుంటారు. కానీ ఇప్పుడు న్యూరో ఎండోస్కోపీ వంటి ఆధునిక పద్ధతుల ద్వారా బయటి పరికరాలు లేకుండానే శాశ్వత పరిష్కారం అందించవచ్చు. పదే పదే సర్జరీలు చేయించు కుని ఆశ కోల్పోయిన ఈ రోగి తిరిగి ఆరోగ్యంగా మారడం మాకు ఎంతో ఆనందంగా ఉంది," అని తెలిపారు. పదే పదే శస్త్రచికిత్సలు చేయించుకుని ఆశలు కోల్పోయిన ఒక కుటుంబానికి ఈ చికిత్స కొత్త వెలుగును నింపింది. నరాల సంబంధిత లక్షణాలను ముందుగానే గుర్తించి, నిపుణులైన వైద్యులను సంప్రదిస్తే ఇలాంటి సంక్లిష్ట సమస్యల నుండి త్వరగా బయటపడవచ్చని ఈ ఘటన స్పష్టం చేస్తోంది.

## మూడు నెలల రేషన్ బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**-చిమిర్యాల సర్పంచ్ ఉప్పల రమేష్ గౌడ్**



సంస్థాన్ నారాయణపూర్, ఏప్రిల్ 09 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి): గరీబ్ కళ్యాణ్ అన్న యోజన పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ఉచిత రేషన్ బియ్యాన్ని లబ్ధిదారులు ప్రతినెల రేషన్ షాప్ కు వెళ్లి తెచ్చుకునే పరిస్థితులలో వేసవికాలంలో రోజురోజుకు పెరుగుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకొని రేషన్ సరుకులు తెచ్చుకునే క్రమంలో ప్రజలు వడదెబ్బకు గురయ్యే అవకాశాలు ఉంటాయని ముందే గ్రహించిన పేదల పెన్నిధి భారత ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ ఏప్రిల్, మే, జూన్ మూడు నెలల రేషన్ బియ్యం ఒకేసారి ఇప్పించేందుకు తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ చిమిర్యాల గ్రామ సర్పంచ్ ఉప్పల రమేష్ గౌడ్ హర్షం వ్యక్తం చేస్తూ ప్రజలందరూ కూడా ఈ సదవకాశాన్ని వినియోగించుకొని మూడు నెలల సరుకులు ఒకేసారి తెచ్చుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా భారత ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ కి పేద ప్రజల పక్షాన సర్పంచ్ ఉప్పల రమేష్ గౌడ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## ఆదివాసి పోరుబిడ్డ రాంజీ గోండ్ 166వ వర్ధంతి



ఆదిలాబాద్, ఏప్రిల్ : 09 ( తెలంగాణ వాణి ప్రతినిధి ) :ఆదివాసి పోరుబిడ్డ రాంజీ గోండ్ 166వ వర్ధంతి వేడుకలను ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. బస్టాండ్ ఎదుట ఏర్పాటు చేసిన వర్ధంతి కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్ హాజరై ఆయన విగ్రహం వద్ద పూజలు చేశారు. అనంతరం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆదివాసీ నేతలు పలు సమస్యలను చైర్ పర్సన్ దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లా అంటే అడువుల జిల్లానే కాకుండా ఆదివాసుల జిల్లా అని గుర్తు చేశారు. వారి సంస్కృతి, సంప్రదాయాలు చాలా గొప్పవని పేర్కొన్నారు. దేశ స్వతంత్ర్య సమరంలో రాంజీగోండ్ పాత్ర కీలకమన్నారు. స్వతంత్ర్య ఉద్యమంతో పాటు ఆదివాసుల హక్కుల కోసం కూడా పోరాడారని గుర్తు చేశారు. చిన్నచిన్న సమస్యలకే ఆత్మహత్యలు చేసుకునే వారు స్వతంత్ర్య సమర యోధులను ధైర్యసాహలను స్ఫూర్తిగా తీసుకుంటే ఎంతటి సమస్యనైన సాధించవచ్చని తెలిపారు. అదే విధంగా ఆదివాసీ నాయకులు పలు సమస్యలను తెలియజేశారని వాటిని పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు మడావి రాజు, సిడం రాంకిషన్, కుర్సుంగ తనాజీ, గేడం మాదవ్, జంగు పటేల్, దుర్వ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత

## మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్:ఏప్రిల్09 (తెలంగాణ వాణి స్టేట్ కోఆర్డినేటర్) రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో 'సమత కిచెన్'ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్ మరియు జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి కూడా పాల్గొన్నారు. అన్ని వర్గాల అభివృద్ధి ద్వారానే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని, ముఖ్యంగా దివ్యాంగులు మరియు ట్రాన్స్‌జెండర్ల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు.
?సమత కిచెన్ ద్వారా ఆరుగురు ట్రాన్స్‌జెండర్లు మరియు ఒక దివ్యాంగుడికి ఉపాధి కల్పించడం పట్ల మంత్రి హర్షం వ్యక్తం చేశారు. అలాగే ఆర్థిక పునరావాస పథకంలో భాగంగా ఆరుగురు ట్రాన్స్‌జెండర్లకు చెక్కులను, ఐదుగురు దివ్యాంగులకు బ్యాటరీ ఆధారిత వీల్ చైర్లను పంపిణీ చేశారు. సమాజంలో వెనుకబడిన వర్గాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన వివరించారు. ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ మరియు ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్ల సామాజిక స్వీకరణ గురించి మరియు వారికి ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాల గురించి ప్రస్తావించారు. కలెక్టర్ హరి చందన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ నైపుణ్యాభివృద్ధి శిక్షణలు అందించి, వారి ఆసక్తులకు అనుగుణంగా ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ఇళ్ల మధ్య సెల్ టవర్ ఏర్పాటు మాకొద్దు.. గ్రామస్తులు రోడ్డుపై బైఠాయింపు

పెంట్లవెల్లి: మండల పరిధిలోనీ గోపాలాపూర్ గ్రామస్తులు గురువారం రోడ్డెక్కారు. గ్రామంలో 10 వ వార్డులో ఇళ్ల మధ్య సెల్ టవర్ నిర్మాణం మాకొద్దంటూ నినాదాలు చేశారు. మా గ్రామమే మాకు ముద్దంటూ గోపులాపూర్ గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. గోపాలాపూర్ గ్రామంలోని 10వ వార్డు సర్వే నెంబర్ 177 లోనివాస ఇళ్ల మధ్య అధికారుల అనుమతి లేకుండా సెల్ టవర్ నిర్మాణం చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తూ సెల్ టవర్ ఏర్పాటు చేయొద్దంటూనినాదాలు చేశారు. మా గ్రామమే మాకు ముద్దు అంటూ గోపులాపూర్ గ్రామం చౌరస్తాలో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. పోలీసులు జోక్యంతో ఆందోళన విరమించారు.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com